ఎల్లలు దాటిన ప్రేమ... రాయపర్తి అబ్బాయి థాయిలాండ్ అమ్మాయి



నవతెలంగాణ-రాయపర్తి

రాయపర్తి అబ్బాయి థాయిలాండ్ అమ్మాయి వివాహం శనివారం వైభవంగా జరిగింది. రాయపర్తికి చెందిన ఎస్తేర్-జాన్సన్ కుమారుడు స్టీవ్ నెల్సన్. థాయిలాండ్ దేశానికి చెందిన మేరీ-హెలైన్ కూతురు డెబోరా 2018సంవత్సరంలో చైన్నై చదువుకుంటుండగా వీరి మధ్య స్నేహం ఏర్పడింది అది ప్రేమగా మారింది. కాగా ఇరువురి తల్లి దండ్రుల సమక్షంలో వరంగల్ జరుపాక చర్చిలో అంగరంగ వైభవంగా వివాహం జరిగింది. ఎర్రబెల్లిచారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎర్రబెల్లి ఉషా దయాకర్‌రావు వివాహానికి హాజరై నవ దంపతులను ఆశీర్వదించి నూతన వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు బిల్లా సుధీర్ రెడ్డి, రాయపర్తి సర్పంచ్ గారె నర్సయ్య, పోగులకొండ వేణు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయండి



నవతెలంగాణ-కాశిబుగ్గ

డివిజన్ లో నెలకొన్న పెండింగ్ పనులను పూర్తయ్యేలా చూడాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ ను 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్లి రవి విజ్ఞప్తి చేశారు. వరంగల్ మహా నగర పాలక సంస్థ కమిషనర్ గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన షేక్ రిజ్వాన్‌బాషాను శనివారం కార్పొరేటర్ మరుపల్లి రవి మర్యాదపూర్వకంగా కలిసి పూల బోకే అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా డివిజన్ లోని పెండింగ్ పనులను కమిషనర్ కు వివరించగా అందుకు స్పందించిన కమిషనర్ నిలిచిపోయిన పనులను పూర్తయ్యేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు రవి తెలిపారు.

ఎమ్మెల్యేల్లో టెన్షన్... ఆశావహుల్లో అటెన్షన్

ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్ఎస్‌లో గందరగోళం



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12మంది ఎమ్మెల్యేల్లో 11మంది బీఆర్ఎస్‌కు చెందిన వారే. వచ్చే శాసనసభ ఎన్నికల్లో సిట్టింగ్‌లను ఎవరిని మారుస్తారోనన్న భయం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను వెంటాడుతుంది. ములుగు ఎమ్మెల్యే సీతక్క మినహా మిగతా నియోజకవర్గాల్లో బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యేలే వున్నారు. 11 మంది బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో మెజారిటీ ఎమ్మెల్యేలపై వ్యతిరేకత వుంది. అంతేకాకుండా నియోజకవర్గాల్లో రాష్ట్ర ప్రభుత్వంపై సైతం వ్యతిరేకత వుంది. ఈ క్రమంలో సీఎం కేసీఆర్ పలు దఫాలుగా చేయించిన సర్వేల్లో జిల్లాలోని ఎమ్మెల్యేలపై వున్న వ్యతిరేకత నేపథ్యంలో బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశాల్లో రెండుసార్లు పరస్పరం భిన్నమైన వ్యాఖ్యలు చేయడంతో సిట్టింగ్ ఎమ్మెల్యేలు కలవరపడుతున్నారు. ఒకమారు వచ్చే ఎన్నికల్లో సిట్టింగ్‌లకు పార్టీ టికెట్‌లు ఇస్తామని ప్రకటించారు. తాజా సమావేశంలో అవినీతికి పాల్పడుతున్న వారితోక కత్తిరిస్తానని వ్యాఖ్యానించారు. దీంతో పార్టీ టికెట్‌లను ఆశిస్తున్న ఆశావహులు అప్రమత్తమయ్యారు. ఎవరి ప్రయత్నాల్లో వారున్నారు. 11 మంది సిట్టింగ్‌లలో 8 మందిపై వ్యతిరేకతవుందని, ఇందులో ఐదుగురు సిట్టింగ్‌లను మారుస్తారన్న ప్రచారం పార్టీ శ్రేణుల్లో నడుస్తుంది.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్‌కు చెందిన 11 సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో 8 మంది ఎమ్మెల్యేలపై ప్రజల్లో వ్యతిరేకత వుండడం, పలువురిపై భూకబ్జాలు, సెటిల్‌మెంట్లు ఆరోపణలుండడంతో పార్టీ విజయావకాశాలపై తీవ్ర ప్రభావం పడనుందని పలువురు సీనియర్ నేతలు భావిస్తున్నారు. సీఎం కేసీఆర్ సిట్టింగ్‌లకే మరోమారు పార్టీ టికెట్లు ఇస్తామని ప్రకటించినా, క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితి ఇందుకు భిన్నంగా వుంది. పీకేబృందం నిర్వహించిన సర్వేతోపాటు పలు సర్వేలను చేయించి సిట్టింగ్ ఎమ్మెల్యేల వాస్తవ పరిస్థితిని ఎప్పటికప్పుడు సీఎం మదింపు చేస్తున్నారు. సర్వే నివేదికల ఆధారంగా పలువురు ఎమ్మెల్యేలను ఇప్పటికే సీఎం కేసీఆర్ మందలించారని పార్టీశ్రేణుల్లో ప్రచారం జరుగుతుంది.

తాజా విస్తృతస్థాయి సమావేశంలో దళితబంధు పథకంలో ఎమ్మెల్యేలు అవినీతికి పాల్పడుతున్నారని, వారి చిట్టా తనవద్దవుందని, పద్ధతి మార్చుకోకపోతే తోక కత్తిరిస్తానని ఘాటుగా హెచ్చరించారు. దీంతో సిట్టింగుల్లో గుబులు బయలుదేరింది. ఇప్పటి వరకు తమకు వచ్చే ఎన్నికల్లో పార్టీటికెట్‌కు ఢోకాలేదని భావించిన సిట్టింగులు సీఎం తాజా హెచ్చరికలతో భయాందోళనలో పడిపోయారు. 11 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, వరంగల్ తూర్పు, మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాల్లో అభ్యర్థుల మార్పువుండే అవకాశముందన్న ప్రచారం పార్టీ వర్గాల్లో జరుగుతుంది.

ప్రజలతో మమేకమై..

శాసనసభ ఎన్నికలకు గడువు దగ్గరపడుతుండడంతో రాజకీయ పార్టీలు పార్టీ కార్యక్రమాలు, పార్టీల్లో చేరికలను వేగవంతం చేశాయి. ఈ క్రమంలో అధికార బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యేలపై వ్యతిరేకత వుండడంతో వారికి సీఎం ఇప్పటికే హెచ్చరించడం దరిమిలా సదరుఎమ్మెల్యేలు ఆయా నియోజకవర్గాల్లో పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నారు. బీఆర్ఎస్ ఆత్మీయ సభలు గ్రామస్థాయి వరకు నిర్వహిస్తుండడం గమనార్హం. బీఆర్ఎస్ ఆత్మీయ సభలకు పలు గ్రామాల్లో ప్రజలు హాజరుకావడంలేదు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సొంత నియోజకవర్గమైన పాలకుర్తి పరిధిలోని పెద్దవంగర మండలంలో పలు గ్రామాల్లో ప్రజలు హాజరుకాకపోవడం గమనార్హం. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుపై వ్యతిరేకత లేదని భావిస్తున్న క్రమంలో ఆత్మీయ సభలకు ప్రజలు రాకపోవడం విస్మయాన్ని కలిగిస్తుంది.

'సిట్టింగు'ల్లో గుబులు

వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నారు. 'దాస్యం' వర్గంలోనూ గుబులుంది. తమ నేతపై కుట్రలు జరుగుతున్నాయని భావిస్తున్నారు. ఈ క్రమంలో 'దాస్యం' ఎక్కడున్నా ఆయన వెంటే వుండాలని ఇటీవల జరిగిన ముఖ్యుల సమావేశంలో అనుచరులు నిర్ణయించుకున్నట్లు సమాచారం. తాజాగా సీనియర్ నేత, మాజీ మంత్రి, డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్.రెడ్యానాయక్ సైతం తనను ఓడించడానికి కుట్రలు జరుగుతున్నాయని వ్యాఖ్యానించడం బీఆర్ఎస్‌లోని అంతర్గత విభేదాలను బహిర్గతం చేస్తుంది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే వచ్చే ఎన్నికల్లో గెలుపు కష్టసాధ్యంగా మారే అవకాశాలు లేకపోలేదు. సీఎం కేసీఆర్ తాజా వ్యాఖ్యలతో వచ్చే శాసనసభ ఎన్నికల్లోపార్టీ టికెట్‌లను దక్కించుకోవడానికి ఎమ్మెల్సీలు, ద్వితీయశ్రేణి నేతలు ఎవరికి వారు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు.

భూ పోరాటాల నాయకులపై దాడి హేయం

సర్వే నెంబర్ 321 భూములను పేదలకు పంచాలి
సీపీఎం నాయకురాలు నలిగంటి రత్నమాల



నవతెలంగాణ-వరంగల్

భూ పోరాటాల నాయకులపై దాడి చేయడం హేయమైన చర్య అని సీపీఐ (ఎం) నాయకురాలు నలిగంటి రత్నమాలఅన్నారు. సీపీఐ(ఎం) నాయకులు దుర్గయ్య అధ్యక్షతన నిరసన తెలిపారు. ఈసం దర్భంగా సీపీఐ (ఎం) నాయకురాలు నలిగంటి రత్నమాల మాట్లాడుతూ శివనగర్ ఏరియా మైసయ్య నగర్ సమీపంలోనీ సర్వే నంబర్ 321 భూములలో పేదలుగుడిసెలు వేసుకుంటే సీపీఐ(ఎం) నాయకులపై కొంతమంది దాడిచేయడం సిగ్గుచేటు అన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం నుండి ఇల్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టిస్తానని చెప్పారు. అదేవిధంగా 58 జీవో ప్రకారం ప్రభుత్వ భూముల్లో ఉంటున్న ప్రతి ఒక్కరికి ఇళ్ల పట్టాలు ఇస్తామని , ఇల్లు కట్టుకోవడానికిరూ.3లక్షలు ఇస్తామని తెలిపారు . నిరుపేదల కోసం భూ పోరాటాలు చేసి ఇళ్ల స్థలాలు ఇప్పించిన చరిత్ర సీపీఐ(ఎం) పార్టీకి ఉందని అన్నారు.

స్థానిక కార్పొరేటర్ ప్రజాప్రతినిధి అండదండలతో కొంతమందిని ఉసిగొల్పి, నిరుపేదలు వేసుకున్న గుడిసెలను తీసేస్తూ అదేవిధంగా జెండాలను, బ్యానర్లను చింపుతు సీపీఐ(ఎం) నాయకులపై దాడులు చేస్తూ భయానక వాతావరణం సృష్టిస్తు, సీపీఐ(ఎం) నాయకులపై దుష్ప్రచారం చేస్తున్నా రని అన్నారు. అధికార బలం, ధన బలం ఉందని నిరుపేదలలో అనైక్యతను సృష్టించి భూ పోరాటా లను అపాలనుకోవడం అవివేకం అన్నారు.

అధికారం ఎల్లకాలం ఉండదన్నారు, ప్రజా ప్రతినిధులకు అధికారం పేదలు పెట్టిన బిక్ష అని అన్నారు. విద్యార్థులు, నిరుపేదలు, మేధావులు యువకులు, ప్రతిఒక్కరూ గమనిస్తున్నారనీ అన్నారు. గద్దెనెక్కిచ్చిన పేద ప్రజలే గద్దె దించే రోజు అతి త్వరలో ఉందనిఅన్నారు. ఇప్పటికైనా పేద ప్రజల న్యాయ పోరాటాన్ని గమనించి నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించడానికి కృషి చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఖిలా వరంగల్ ఏరియా కమిటీ నాయకులు సుతారి సారంగపాణి, ఉదయ్ కుమార్, వేణు, సమ్మయ్య, కన్నా శ్రీను సదన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అండగా నిలవాల్సిన వారే.. అనాథను చేశారు..!

పండు ముసలికి పట్టెడన్నం కరువు
ఆస్తులను ఆరగించి అంగట్లో వదిలేశారు
మండుటెండలో ముళ్లచెట్ల కింద భోరుమంటున్న కొమురయ్య



నవతెలంగాణ-రాయపర్తి

పిల్లలు లేకున్నా చింతించలేదు.. నా అనుకున్న వారు ఉన్నారు కదా అని భావించాడు.. బావమరుదులే చివరి వరకు అండగాఉండి ఆదుకుంటారని ఆస్తిని సైతం పంచిఇచ్చాడు. చివరికి వారేఅనాథను చేసి బంధాలను మరిచి అర్థాంతరంగా గ్రామం సమీపంలో వదిలేశారు. ఈ అమానవీయ ఘటన వరంగల్ జిల్లా రాయపర్తి మండలకేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే స్థానికుల కథనం మేరకు రాయపర్తికి చెందిన చందు నర్సమ్మ వెంకటయ్య దంపతులకు ముగ్గురు కుమారులు, ఒక్కకుమార్తె. కాగా కుమార్తె రాజమ్మను గత 75 ఏళ్ల క్రితం ఇదే గ్రామానికిచెందిన చందు కొమురయ్యకు ఇచ్చి వివాహం చేసి ఇల్లరికం తెచ్చుకున్నారు. వెంకటయ్య తనకు ఉన్నటువంటి ఆస్తిని ముగ్గురు కుమారులకు కూతురుకు పంచిఇచ్చాడు. కొమురయ్య రాజమ్మకు సంతానం కలగలేదు.. వారికి వయసు పైబడడంతో ఉన్నటువంటి 6 ఎకరాల వ్యవసాయం భూమిని, 6 తులాల బంగారం, 50తులాల వెండిని ముగ్గురి బావమరుదులకు సమానంగా పంచి ఇచ్చాడు. చేతనైనంతవరకు వారికి చేదోడు వాదోడుగా ఉంటూ అండగా నిలిచాడు. ఐదేళ్లక్రితం భార్య రాజమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. తదుపరి బావమరదలు నెలసరి వాటాల వారిగా సాకుతున్నారు. పగలు నామమాత్రంగా రాత్రి పూర్తిగా కళ్ళు కనిపోయించని 85ఏళ్ల వృద్ధుడైన కొమురయ్యను శనివారం మండల కేంద్రంలోని అంగడి సమీపంలోచుట్టూ పరదలు కట్టి వదిలేసి వెళ్లిపోయారు అని వివరించారు. ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ఇండ్లలో కూలర్లు, ఏసీల కింద ఉంటున్న వారే అస్వస్థతకు గురవుతున్నారు.. ఎర్రటిఎండలో వడ గాలుల వేడిలో వద్దుడు పడుతున్న బాధ చూస్తే వర్ణనాతీతంగా ఉంది అని స్థానికులు బాధ పడుతున్నారు. అధికారులు, బాధ్యత గల ప్రజా ప్రతినిధులు చొరవ చూపి కొమురయ్య బాధను తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

హరికృష్ణకు రసమయి పరామర్శ



నవతెలంగాణ-శాయంపేట

తెలంగాణ రాష్ట్ర భాష సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తండ్రి డాక్టర్ సుదర్శన్ అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మరణించాడు. శనివారం మానకొండూరు ఎమ్మెల్యే, సాంస్కృతిక శాఖసారథి రసమయి బాలకిషన్ సందర్శించి సుదర్శన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి : కలెక్టర్



నవతెలంగాణ-సుబేదారి

రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించడానికి జిల్లా ఉన్నతాధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరెట్ మీటింగ్ హాల్లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్దిఉత్సవాల సన్నాహక సమావేశాన్ని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి తో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాలను ప్రభుత్వం సూచించిన క్యాలెండర్ ప్రకారం పెద్దఎత్తున కార్యక్రమాలు నిర్వహించి విజయవంతం చేయాలని కోరారు. జూన్ 2న అమర వీరుల త్యాగాలను గుర్తు చేస్తూ వారికి నివాళులు అర్పిస్తూ ప్రారంభం అయ్యే ఉత్సవాలు జూన్ 22 అమరవీరుల సంస్మరణ సభ,అమరవీరుల స్తూపం అవిష్కరణతో ముగిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రం రాక ముందు, వచ్చిన తర్వాత జరిగిన అభివృద్ధిని మరొక్కసారి గుర్తు చేస్తూ ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రం ఏర్పాటు లాగే హనుమకొండ జిల్లా ఏర్పాటు, అదే విధంగా నూతన మండలాలు, నూతన గ్రామ పంచాయతీల ఏర్పాటుతో ప్రజలకు పాలన మరింత దగ్గరైందని అన్నారు. కొత్తజిల్లాగా ఏర్పాటు అయిన హనుమకొండ జిల్లా కేంద్రంలో సంబరాలు పెద్దఎత్తున నిర్వహించాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యా కోసం జరుగుతున్న కృషిని, మనఊరు-మనబడి కింద పాఠశాలల్లో వచ్చిన మార్పులను తెలియచెప్పాలన్నారు. జిల్లా వైద్య రంగం లో సాధించిన ప్రగతిని, కంటివేలుగు, కెసిఆర్ కిట్, ఆరోగ్యశ్రీ సేవలు తెలియచెప్పాలని అన్నారు. పల్లె ప్రగతి, పట్టణప్రగతితో జాతీయ స్థాయి అవార్డులు సాధించి తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రచారం చేయాలని, ఒక్కో గ్రామానికి అందుతున్న రైతు బంధు, రైతు భీమా, వివిధ రకాల పెన్షన్లు, షాది ముబారక్, కళ్యాణ లక్ష్మి, చెరువుల్లో వదిలిన చేప పిల్లలు, గొర్రెల పంపిణీ అన్ని రకాల వివరాలతో గ్రామాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, అదేవిధంగా పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కింద మంజూరైన వివరాలతో పాటు అన్ని రకాల అభివద్ధి నిధుల వివరాలు తెలిసేలా ప్రచారం చేయాలన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలు అన్నింటిని పరిశుభ్రంగా ఉంచాలని, వేడుకలకు ముస్తాబు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ట్రైనీ ఐపిఎస్ అధికారి అంకిత్ శంకువార్, డీసీపీ ఎంఎ.బారి,డీఆర్ఓ వాసు చంద్ర, పరకాల ఆర్డీవో రాము, డిఎండబ్ల్యూఓ శ్రీను, జిఎం ఇండస్ట్రీస్ హరిప్రసాద్, డిఈఓ అబ్దుల్ హై, డిపిఓ జగదీశ్వర్, డీ ఎమ్ హెచ్ వో సాంబశివరావు, జడ్పీ సీఈవో వెంకటేశ్వర రావు, టూరిజం అధికారి శివాజీ, ఏసిపి కిరణ్ కుమార్, హనుమకొండ తహసిల్దార్ రాజకుమార్, తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

ఆవిర్భావ దశాబ్ధి ఉత్సవాల్లో అందరూ భాగస్వాములు కావాలి
పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



నవతెలంగాణ-జనగామ

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్రపంచాయతీ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపు నిచ్చారు. స్థానిక జిల్లా కలెక్టరేట్లో శనివారం దశాబ్ది ఉత్సవాల ఏర్పాటు సన్నాక సమావేశం జిల్లా కలెక్టర్ శివలింగయ్య అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా దశాబ్ది ఉత్సవాలకు సంబంధించిన లోగోను మంత్రి ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి కలెక్టర్ కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ ఉత్సవాల నిర్వహణలో ప్రజాప్రతినిధులు అధికారులతో పాటు ప్రజలను పూర్తిస్థాయిలో భాగస్వాములను చేయాలన్నారు. గ్రామాల్లో ఆయా శాఖలు సంబంధించిన నాడునేడు అనే అంశాలను స్పష్టంగా చెప్పే విధం గా అధికారులు ప్రణాళికను రూపొందించుకోవాలన్నారు.ఈ ఉత్సవాలను జూన్ 2 నుండి 22 వరకు నిర్వహించాలన్నారు. సీఎం ఆదేశాల మేరకు ప్రభుత్వ అన్నిశాఖల ప్రగతిని ప్రజలకు వివరించాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడక ముందుగతంలో గ్రామాల దయనీయ స్థితి తో స్థితిని వివరిస్తూ ఆ తర్వాత వచ్చిన మార్పులు అభివృద్ధిని ప్రజలకు కనులకు కట్టే విధంగా వివరించాలన్నారు. అందుకుగాను అధికారులు ప్రజలను ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేసి విజయవంతం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నఈ తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్దిఉత్సవాలను పండగల నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివద్ధి వివిధ సంక్షేమపథకాలు దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిచాయన్నారు. అనంతరం ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య మాట్లాడుతూప్రభుత్వ ప్రజా పథకాలను ప్రజల్లో తీసుకునే తీసుకు వెళ్లేందుకు అధికారులు ప్రజాప్రతినిధులు ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగి ఈ ఉత్సవాలనువిజయవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, డీసీపీ సీతారాం, డీసీసీబీ చైర్మన్ రవీందర్‌రావు, మున్సిపల్ చైర్ పర్సన్ పి.జమున, జిల్లా రైతు సమన్వయ కమిటీ కో-ఆర్డినేటర్ ఎర్రి రమణారెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కృష్ణారెడ్డి, ఆయాశాఖల అధికారులు, పోలీసుఅధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్ట్ భూముల సర్వే వెంటనే పూర్తి చేయాలి

వరంగల్ జిల్లా కలెక్టర్ పీ.ప్రావీణ్య



నవతెలంగాణ-వరంగల్

వరంగల్ ఎయిర్పోర్ట్ కి కావాల్సిన అదనపు భూములకి సంబంధించి సర్వేప్రక్రియ వేగవంతమయ్యేందుకు జాయింట్ ఇన్‌స్పెక్షన్ టీంను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. ఎయిర్‌పోర్ట్‌కి కావలసిన 271 అదనపు భూములకు సంబంధించి జియో కో-ఆర్డినేట్ ఆధారంగా మ్యాప్ ను తయారు చేయాలిసిందిగా రెవెన్యూ నుండి వరంగల్ ఆర్‌డీఓ మహేందర్‌జీ, తహసీల్దార్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ నుండి ఏడీ సర్వేయర్, ఆర్‌అండ్‌బి శాఖ ఈఈ, డీఈలు, ఎయిర్‌పోర్ట్ అథారిటీ నుండి జాయింట్ జనరల్ మేనేజర్ (ల్యాండ్స్) మహాలక్ష్మిలను జాయింట్ ఇన్స్పెక్షన్ టీంగా ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. శనివారం కలెక్టర్ తన ఛాంబర్‌లో కుడా అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాయుడు పెట్రోల్ బంక్ నుండి ఏనుమాముల మార్కెట్ వరకు 8 కిలోమీటర్ల పొడవున నిర్మించనున్న ఇన్నర్ రింగ్‌రోడ్ పనులకు సంబందించి 15 రోజుల్లో టెండర్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. క్లియర్ స్ట్రెచ్‌లలో ఐఆర్‌ఆర్ నిర్మాణం ప్రారంభమవుతుందని, మిగిలిన భూముల కోసం భూ సేకరణ చేయాలిసిందిగా అర్‌డీఓని ఆదేశించినట్లుగా కలెక్టర్ తెలిపారు. వచ్చే నెల మొదటి లేదా రెండవవారంలోపు ఓ సిటీ యాక్షన్ పనులు అలాగే మాసిటీ వర్కర్స్ ఆలాట్‌మెంట్‌కి సంబంధించి పెండింగ్‌లో ఉన్నఅంశాలను పూర్తి చేయాలన్నారు.అన్ని పత్రాలను సమర్పించిన ఏ జే మిల్లుల మాజీ ఉద్యోగు లకు కేటాయించిన వారందరికీ మా సిటీలో ప్లాట్‌ల కేటాయింపు లేఖలు కూడా అందాయన్నారు.ప్రస్తుతం ఉన్న వరంగల్ బస్‌స్టాండ్ స్థానం ఆధునాతన బస్ స్టాండ్ నిర్మాణం చేయనున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ బస్ షెల్టర్ పనులు వచ్చే నెల 10 వ తేదీ లోపు పూర్తి కావా లని కుడ అజిత్ రెడ్డి ని కలెక్టర్ ఆదేశించారు.

ఓపెన్ జీమ్ ప్రారంభం



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

వాక్అండ్ టాక్‌విత్ ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా ఈ రోజు ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ గొల్లపల్లి ఎస్సా రెస్పీ కెనాల్ వాకర్స్ ఆసోసియేషన్ వారికి గతంలో ఇచ్చిన హామీమేరకు ఓపెన్‌జిమ్ ఏర్పాటుచేసి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సారెస్పీ కెనాల్‌పై ప్రతి రోజు వందల మంది వాకింగ్ చేయడం జరుగుతుంది అని తెలిపారు వారికి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో భాగంగా వాకర్స్ అసోసియేషన్ వారి కోరిక మేరకు ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేయడం జరిగింది అని తెలిపారు అదే విధంగా వాకర్స్ అసోసియేషన్ వారు సొసైటీగా ఏర్పాటు కావడానికి తనవంతు బాధ్యతగా ఎమ్మెల్యేగా తన గౌరవ వేతనం నుండి కొంత ఆర్థిక సహాయం చేస్తానని తెలిపారు అదేవిధంగా రాష్ట్రప్రభుత్వం నిర్వహిస్తున్న తెలంగాణ దశాబ్ది వేడుకలలో వాకర్స్ కూడా పాల్గొని దశాబ్ది వేడుకల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ బొంగు అశోక్ యాదవ్ డివిజన్ అధ్యక్షులు మనోజ్, వాకర్స్ అసోసియేషన్ నాయకులు మరియు తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-సుబేదారి

డీఆర్డీఏ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందని డీఆర్డీఏ పిడి శ్రీనివాస్‌కుమార్ తెలిపారు. ఎం జీఎస్ ఆర్‌ఈజీఎస్‌లో పనిచే స్తున్న సమస్త ఉద్యోగులకు డైరెక్టర్ గ్రామీణ అభివృ ద్ధిశాఖ హైదరాబాద్ వారిఆదేశాల మేరకు జిల్లా గ్రామీణభివృద్ధి సంస్థ హనుమకొండ ఐడిఒసి కార్యాలయంలో ఉచిత వైద్యశిబిరం ఏకశిలాహాస్పిటల్ ఆధ్వర్యంలో మెడి-అసిస్ట్, ఓరియంటల్ ఇన్సూరెన్స్ వారి సౌజన్యంతో శనివారం 27న నిర్వహించారు. ఇట్టి శిబిరానికి ఈజీఎస్ ఉద్యోగులు పెద్దసంఖ్యలో పాల్గొనిహెల్త్‌క్యాంప్‌ను సద్వినియోగపర్చుకున్నారు. వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ,డి ఆర్ డి ఓ శ్రీనివాస్ కుమార్ సందర్శించి ఉద్యోగుల ఆరోగ్య సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ శిబిరంలో గుండెకు సంబంధించి 2డి ఏకో,ఈసీజీ టెస్టులు, గైనకాలజీ, బిపి, షుగర్, ఆర్థరైటిస్, బిఎండి, కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో ఎక్కువ సమస్యలు నిర్ధారణ అయితే వారిని హయ్యర్ హాస్పటల్ కి రిఫర్ చేయడం జరిగింది.

ఈ వైద్య శిభిరం తమకు చాలా ఉపయోగ పడిందని, అంతర్గత ఆరోగ్య సమస్యలు తెలిసాయని ఈ.జి.ఎస్ ఉ.ద్యోగులు సంతోషం వ్యక్త పరిచారు, డిఆర్‌డిఓ కృతజ్ఞతలు తెలిపారు.

కేసీఆర్ పాలనలో ఆలయాలకు పూర్వవైభవం

వర్ధన్నపేట ఎమ్మెల్యే ఆరూరి రమేష్



నవతెలంగాణ-కాశిబుగ్గ

సీఎం కేసీఆర్ పాలనలో దేవాలయాలకు పునర్వైభవం సంతరించుకుంటుందని ఎమ్మెల్యే, బిఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఆరూరి రమేష్ అన్నారు. శనివారం 14వ డివిజన్ ఎస్సార్‌నగర్‌కు చెందిన అభయాంజనేయ స్వామి దేవాలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే ఆరూరి రమేష్ ను ఆయన నివాసంలో కలిసి దర్వాజ ప్రతిష్టాపన కార్యక్రమానికి ఆహ్వానించారు . ఎస్సార్‌నగర్‌లో నిర్మిస్తున్న అభయాంజనేయస్వామి ఆలయదర్వాజ ప్రతిష్టాపన కార్యక్రమం ఈనెల 31న ఉన్నందున ఎమ్మెల్యేను ఆహ్వానించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ 14వ డివిజన్ అధ్యక్షుడు ముడుసు నరసింహ, ఆలయ కమిటీ అధ్యక్షుడు మార్తసుభాష్, గుడిపూజారిరాజు, కేతిరి రాజశేఖర్, పసులాది మల్లయ్య, అమర్ రాజుకుమార్, రాపర్తి సతీష్, కేతిరి సమ్మక్క, ప్రభాకర్ సీపీఐ నాయకులు తాళ్లపెల్లి రహేళ, అంబాల సత్యం, దామెర కృష్ణ, దాసు, బీజేపీ నాయకులు ఆడెపు అశోక్, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణహిత క్యాంపస్‌గా రూపొందించేందుకు కృషి



నవతెలంగాణ-కాజీపేట

జాతీయ సాంకేతిక విద్యాలయం నిట్ వరంగల్‌ను పర్యావరణ హిత క్యాంపస్‌గా రూపొందించేందుకు, పరిశుభ్రంగా మార్చడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నిట్‌వరంగల్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి అన్నారు.నిట్ నందు శనివారం ఉదయం స్వచ్ కాంపెయిన్ కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులతో పాటుగా ముఖ్యఅతిథిగా నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి హాజరై క్లీనింగ్ డ్రైవ్‌లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థుల కొరకు నిట్ వరంగల్ ను పర్యావరణహిత క్యాంపస్‌గా రూపొందించేందుకు క్లీనింగ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి నెలా చివరి శనివారం ఉదయం 7 గంటల నుండి 9 గంటల మధ్య క్లీనింగ్ డ్రైవ్ నిర్వహిస్తామని, క్యాంపస్‌ను పరిశుభ్రంగా మార్చడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలనికోరారు. దేశంలోనే పరిశుభ్రమైన విద్యాసంస్థల్లో ఒకటిగా ఎన్ఐటీ వరంగల్‌ను తీర్చిదిద్దాలన్నారు.క్యాంపస్ ని పరిశుభ్రంగా మార్చేందుకు స్వచ్ఛ్ భారత్ ప్రతిజ్ఞవాలంటీర్లతో చేయించడం జరిగిందన్నారు. వాలంటీర్లు బృందాలుగా న్యూఅకడమిక్ బిల్డింగ్, ఫుడ్ స్ట్రీట్, ఇన్స్టిట్యూట్ ఫుడ్ కోర్టుల ప్రాంతాలను శుభ్రం చేశారు. దాదాపు 650 మంది అధ్యాపకులు, సిబ్బంది స్వచ్ఛందంగా క్లీనింగ్ డ్రైవ్‌లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ ఐఎకె రెడ్డి, కమిటీ సభ్యులు, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్.దయానిధి, విద్యార్థులు అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం

నవతెలంగాణ-నడికూడ

మండలంలోని చౌటుపర్తి గ్రామానికి చెందిన గూడపు కాసిం అనే రైతు గడ్డివాము శనివారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పూర్తిగా కాలిపోయింది. స్థానికుల వివరాల ప్రకారం గూడెపు కాసిం అనే రైతు 200 గడ్డి కట్టలను ఇంటి పరిసరాల్లో పశువుల కోసం నిల్వ పెట్టుకున్నారు.ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో గడ్డి కట్టలు అంటుకోగా అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేయడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. లేకుంటే భారీగా నష్టం జరిగేదని గ్రామస్తులు తెలిపారు.

నవతెలంగాణ
ములుగు, భూపాలపల్లి
ఆదివారం 28 మే 2023 | 2

అభివృద్ధి పనుల పరిశీలన

నవతెలంగాణ-మహదేవ్‌పూర్



మహాదేవపూర్ మండలంలోని మహాదేవపూర్ బొమ్మపూర్, సూరారం, బెగులూరు, ఎంకపల్లి గ్రామపంచాయతీలను శనివారం జిల్లా పరిషత్తు ముఖ్య నిర్వహణ అధికారి విజయలక్ష్మి సందర్శించి గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించడం జరిగింది. ఇట్టి పనులలో ముఖ్యంగా సీసీ రోడ్లు, సైడ్ కాలువలు, నర్సరీలు, మిగతా పల్లె ప్రగతి పనులు పర్యవేక్షించడం జరిగింది. వీరి వెంట మండల పరిషత్ అభివద్ధి అధికారి ఏ రవీంద్రనాథ్ మండల పంచాయతీ అధికారి ప్రసాద్, మండల పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి రవీందర్, ఉపాధి హామీ ఏపీవో రమేష్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల ప్రమత్తంగా ఉండాలి

డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీరామ్

నవతెలంగాణ- మహదేవ్‌పూర్



రానున్న వర్షాకాలంలో ముఖ్యంగా సీజనల్ వ్యాధులైన మలేరియా, డేంగు జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీరామ్ డాక్టర్లను కోరారు. శనివారం మహదేవపూర్ మండలంలోని అంబటిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీజన్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు ప్రమోద్ కుమార్, జగదీష్, ఎం మనోహర్ రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు వల్లే ఎంతో అభివృద్ధి

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం.

కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ రాష్ట్రానికి తలమానికం

రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్

నవతెలంగాణ- చిట్యాల



తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు వల్లే గ్రామాలు ఎంతో అభివద్ధి చెందుతున్నాయని కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ రాష్ట్రానికి తలమాణికమని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో 25 లక్షలు తో నిర్మాణం చేసిన ఎస్సీ కమ్యూనిటీ హాల్ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి, వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, రాష్ట్ర రైతు విమోచన సంఘం చైర్మన్ నాగూర్ల వెంకటేశ్వరావు, తో కలిసి ఆయన పలు అభివద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలో 35 లక్షలతో ఏర్పాటు చేయనున్న మినీ స్టేడియం పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఈ ప్రాంతం ఎంతో వెనుకబడి ఉందని రాష్ట్రం ఏర్పాటు తర్వాత అనేక అభివద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ ప్రాంతం పై ప్రత్యేక దష్టి పెట్టి జిల్లా ఏర్పాటు చేసి అనేక అభివద్ధి కార్యక్రమాలు చేశారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల భూగర్భ జలాలు పెరిగాయని గతంలో కెనాల్ కాలువలకు ఏనాడు నీరు అందలేదని ఈరోజు రైతులకు కెనాల్ ద్వారా నీరు అందిస్తున్నాడు అంటే అది కేసీఆర్ వల్లే సాధ్యమైందని అన్నారు. ఈ ప్రాంత ప్రజలు కేసీఆర్కు రుణపడి ఉండాలని అన్నారు. అనంతరం వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ భూపాలపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివద్ధి పరచడం కోసం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక నిధులు కేటాయించి అనేక అభివద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మించిన కాంట్రాక్టర్ తవటం నవీన్ ను ప్రత్యేకంగా శాలువాతో సన్మానించి అభినందించారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ జాబు వినోద వీరారెడ్డి జెడ్పిటిసి సాగర్ పిఏసిఎస్ చైర్మన్ కుంభం క్రాంతి కుమార్ రెడ్డి టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు ఆరేపల్లి మల్లయ్య సర్పంచి ఇరుకులపాటి పూర్ణచంద్రరావు ఎంపీటీసీ కట్కూరి పద్మా నరేందర్ టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

త్వరితగతిన వైద్య కళాశాల నిర్మాణ పనులు పూర్తి చేయాలి

వైద్య ఆరోగ్య శాఖ సెక్రటరీ రిజ్వి.

నవతెలంగాణ-భూపాలపల్లి



త్వరితగతిన వైద్య కళాశాల నిర్మాణ పనులు పూర్తి చేయాలని వైద్య ఆరోగ్య శాఖ సెక్రటరీ రిజ్వి సంబంధిత అధికారులను ఆదేశించారు. నూతన వైద్య కళాశాల భవన నిర్మాణ పనుల పై సంబంధిత 9 జిల్లాల కలెక్టర్లతో శనివారం మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నిర్మల్, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, ఖమ్మం, కొమురం భీమ్ ఆసిఫాబాద్ , వికారాబాద్, జయశంకర్ భూపాలపల్లి, జనగాం, కరీంనగర్ జిల్లాలో వైద్య కళాశాల మంజూరు చేశారని, ఈ విద్యా సంవత్సరం ప్రారంభించే దిశగా అవసరమైన అన్ని చర్యలు పగడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. వైద్య కళాశాల, హాస్టల్ భవనాలు మరియు అనుబంధ ఆసుపత్రుల నిర్మాణ పనులను కలెక్టర్లు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని, క్రమం తప్పకుండ నిర్మాణ పనులను తనిఖీ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం మంజూరు చేసిన వైద్య కళాశాల వచ్చే విద్యా సంవత్సరం ఏర్పాటు చేసే దిశగా మొదటి సంవత్సరానికి అవసరమైన మౌలిక వసతుల పనులు, ఫర్నీచర్ పూర్తి చేయాలని ఆదేశించారు.

వైద్య కళాశాల నిర్మాణం పూర్తి చేయడానికి చేపట్టాల్సిన పనుల ప్రణాళిక రూపొందించు కోవాలని, రోజువారీగా లక్ష్యాలను నిర్దేశించుకుని పనులు చేయాలని సూచించారు. వైద్య కళాశాల మరియు అనుబంధ ఆసుపత్రి పనులను సకాలంలో పూర్తిచేయాలని, కాంట్రాక్టర్ కు సంపూర్ణ సహకారం అందించాలని, నిర్మాణానికి అవసరమైన ఇసుక సిమెంట్ ఇతర సామగ్రి కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు.. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ భవిష్ మిశ్రా మాట్లాడుతూ వైద్య కళాశాల నిర్మాణ సివిల్ పనులుతోరలోజూన్ చివరి నాటికి పూర్తి చేస్తామని, ఎలక్ట్రికల్, ప్లంబర్ పనులు, అంతర్గత పనులు ఫర్నిచర్ బిగింపు వంటి పనులను సైతం పూర్తి చేసి జూలై 15 వరకు వైద్య కళాశాల పనులను సంపూర్ణంగా పూర్తి చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ భవిష్ మిశ్రా, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, ఇంజనీరింగ్ అధికారులు డి ఈ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జిల్లా స్థాయి శిక్షణ తరగతులు

నవతెలంగాణ-మహదేవ్‌పూర్

మహదేవపూర్ మండలంలో జరుగుతున్నటువంటి ఎస్ఎఫ్ఐ భూపాలపల్లి జిల్లా స్థాయి శిక్షణ తరగతులకు రెండవ రోజు శనివారం హాజరై విద్యార్థి విద్యార్థులు రాజకీయాలు క్లాస్ బోధించిన రాష్ట్ర సీఐటీయూ నాయకులు బందు సాయిలు అలాగే ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు దామర కిరణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బొడ్డు స్మరణ్, జిల్లా కార్యదర్శి కుమ్మరి రాజు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు దాణా వితరణ

నవతెలంగాణ-గణపురం



కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ల గోశాలకు గణపురం మండల కేంద్రానికి చెందిన పావుశెట్టి శ్రీదేవి- శ్రీనివాస్ దంపతులు వివాహ వార్షికోత్సవం సందర్భంగా శనివారం దాన బస్తాలను అందజేశారు. గోశాలకు దాన బస్తాలు అందజేసిన శ్రీనివాస్, శ్రీదేవి దంపతులకు కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ప్రత్యేక కతజ్ఞతలు తెలిపింది.

వేసవి ఉష్ణోగత్రలపై అవగాహన

నవతెలంగాణ-మహదేవ్‌పూర్



మహాదేవపూర్ మండలం లోని చంద్రుపల్లి గ్రామం లో శనివారం వైద్య ఆరోగ్య సిబ్బంది పర్యటించి ఎండలు, అత్యధిక ఉష్ణోగ్రతల వల్ల పెద్దలు, పిల్లలు వడదెబ్బ, సన్ స్ట్రోక్ తగిలే అవకాశం ఉన్నందున ప్రజలు వడదెబ్బ తగలకుండా ఎండలో అరుబయటకు పనుల దష్ట్యా వెళ్ళినప్పుడు శరీరంలో డీ హైడ్రే రేషన్ అయి నీటి శాతం తగ్గి ప్రాణాపాయం జరుగుతుంది. కావున ఓరల్ రేహైడ్రెషన్ సాల్ట్ కలిగిన చల్లని నీటిని, నిమ్మరసం, తదితర పానీయాలు త్రాగి దప్పిక తీర్చు కొనినచో ఎండా దెబ్బ నుండి రక్షించు కోవాలని తెలుపుతూ ఓఆర్‌యస్ పంపిణీచేసి పిల్లలకు విటమిన్ ఏ, జింక్, ఓఆర్ఎస్ ఇవ్వటం జరిగింది, అదేవిధంగా మలేరియా, లెప్రసీ, శానిటేషన్, గురించి అవగాహనా కలిపించటం జరిగింది.ఈ అవగాహనా కార్యక్రమం హెల్త్ ఎక్స్టెంషన్ ఆఫీసర్ ఏ.స్వామి, హెల్త్ అసిస్టెంట్ అడప రాజ రమణయ్య, ఏఎన్ఎం విజయ, గ్రామకార్యదర్శి మంజురోద్దీన్, ఆశ వర్కర్ జరీన, అంగన్వాడీ వర్కర్ భాగ్య, ప్రజలు పాల్గొన్నారు.

సబ్సిడీ జీలుగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

-చేల్పూర్ సొసైటీ చైర్మన్ గండ్ర సత్యనారాయణ రెడ్డి

నవతెలంగాణ-గణపురం



సబ్సిడీ పై అందిస్తున్న జీలుగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని చేల్పూర్ సొసైటీ చైర్మన్ గండ్ర సత్యనారాయణరెడ్డి తెలిపారు. శనివారం చెల్పూర్ గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో జీలుగా విత్తనాలను రైతులకు అందించారు. ఈకార్యక్రమం లో బల్గురి బాబురావు. కునారపు రాజయ్య. తాళ్లపేల్లి శిరీష సత్యం. తదితరులు పాల్గొన్నారు.ఔ

వృద్ధుడు ఆత్మహత్య

నవతెలంగాణ-మహాదేవ్‌పూర్



మహాదేవపూర్ మండలం లోని సూరారం గ్రామం కు చెందిన గంగారపు సమ్మయ్య 60 సంవత్సరాలు అనే వద్ధుడు తన కొడుకు మద్యంకు బానిసై పలమార్లు చెప్పినా కూడా వినకపోవడంతో, మళ్లీ భూమి కౌలుకు తీసుకొనుటకు డబ్బులు లేక మనస్థాపం చెంది ఈ నెల 22న పురుగుల మందు తాగగా వెంటనే మహదేవ్ పూర్ ఆస్పత్రికి తరలించి అక్కడ నుండి మెరుగైన చికిత్స కోసం ఎంజీఎం ఆసుపత్రి తరలించగా చికిత్స పొందుతూ శనివారం ఉదయం మరణించినాడు.. మాహదేవ్ పూర్ ఎస్సై ఎన్. రాజకుమార్ గారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

నవతెలంగాణ-కాటారం

కాటారం మండలంలో ఇటీవల మరణించిన బాధిత కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, కాటారం పీఏసీఎస్ చైర్మన్ చల్ల నారాయణరెడ్డి పరామర్శించారు. కాటారం మండలం దామరకుంట గ్రామానికి చెందిన ఆంధ్రప్రభ (రూరల్) రిపోర్టర్ కాయిత తిరుపతి తండ్రి ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అల్లాడి రాజయ్య సోదరి సౌందర్య ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. గంగారం గ్రామానికి చెందిన చీర్ల వీరారెడ్డి మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. చల్ల నారాయణరెడ్డి వెంట అయిత వీరారెడ్డి, మాజీ జెడ్పిటీసీ దుర్గ మల్లయ్య, రమేష్ తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం..?

గండ్ర సత్యనారాయణ రావు

నవ తెలంగాణ-మొగుళ్ళ పల్లి



రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని టీపీసీసీ సభ్యులు, నియోజకవర్గ ఇంచార్జి గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఐకేపీ కేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ నేతలు రైతులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత వారం, పది రోజుల నుండి వరి ధాన్యం ఐకేపీ కేంద్రాలకు వస్తున్నప్పటికీ, ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనడం లేదన్నారు. వాతావరణ పరిస్థితులు మారుతూ ఉండడంతో వర్షం పడితే రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. తరుగు పేరుతో రైతులను నిలువునా దోచుకుంటున్నారని, వర్షాకాలం సాగుకు సిద్ధం కావాల్సిన సమయంలో రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకోలేక కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు ధాన్యం తడిసి రైతులు తీవ్రంగా నష్టపోయారని రైతులకు అండగా ఎల్లప్పుడూ కాంగ్రెస్ పార్టీ ఉంటుందన్నారు. ధాన్యం కొనుగోళ్ల వేగవంతం చేయకుంటే రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు కుమారస్వామి, బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ బండి సుదర్శన్ గౌడ్, మాజీ పీఏసిఎస్ చైర్మన్ పోలినేని లింగారావు, టౌన్ అధ్యక్షుడు క్యాతరాజు రమేష్, నాయకులు తక్కళ్ళపల్లి రాజు, ఓనపాకల ప్రసాద్, ఎండీ. రఫీ, నడిగోటి రాము, పసరగొండ మహిపాల్ తదితరులు ఉన్నారు.

ప్రమాణాలు పాటించని హోటళ్లపై చర్యలు తీసుకోవాలి

డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆత్కూరి శ్రీకాంత్

నవతెలంగాణ-భూపాలపల్లి



ప్రమాణాలు పాటించని హోటళ్లపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని శ్రామిక భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ....జిల్లా వ్యాప్తంగా అనుమతులు లేకుండా ధనార్జనే ధ్యేయంగా ప్రజా ఆరోగ్యాలను లెక్కచేయకుండా జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులతో కుమ్మక్కై ఎన్నో హెూటళ్లు నడుస్తున్నాయని ప్రమాదం జరిగితే తప్ప అధికారులు స్పందించే అవకాశమే లేదన్నారు. జిల్లా అధికారులు ప్రజా ఆరోగ్యలపై నిమ్మకునీరేత్తినట్లు, కనీసం చీమకుట్టినట్లు కూడా వ్యవహరించడం లేదని, అసలు జిల్లా లో ఆ శాఖకు సంబంధించిన అధికారి ఉన్నాడా లేడా అనే సందేహాలున్నాయన్నారు. కనీసం ఫోన్‌లో నైనా సమస్యలు వివరిద్దామంటే ఆ అవకాశం కూడా లేని దుస్థితి ఉందని, జిల్లాలో ఆ శాఖకు సంబంధించిన అధికారి ఉన్నట్లయితే వెంటనే స్పందించి డీవైఎఫ్ఐ టీంని కలుపుకొని అక్రమంగా నడిపిస్తున్నటువంటి హోటళ్లపై ఎంక్వయిరీ జరిపి తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనుమతులుండి ప్రమాణాలు పాటించని హోటళ్లపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవడమే కాకుండా హోటళ్లను మూసివేసి ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు కషి చేయాలని లేనిపక్షంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్త ఉద్యమాలకు పూనుకుంటామని హెచ్చరించారు. అంతేకాకఈ జిల్లాలో ఆ శాఖ అధికారి లేకపోతే తక్షణమే కలెక్టర్ ప్రత్యేక చొరవ త తీసుకొని అధికారులను నియమించి ప్రజల ఆరోగ్యాలను కాపాడేందుకు మార్గదర్శకాలు రూపొందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నవీన్ ,హకీం, కవిత, సరిత, లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేట్ కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కుమ్మరి రాజ్ కుమార్

నవతెలంగాణ-మహదేవ్‌పూర్

ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు ఇంటింటా గ్రామ గ్రామాన కరపత్రాలు, వాల్ పోస్టర్లతో ప్రచాంర నిర్వహిస్తున్నవటికి విద్యాశాఖ అధికారులు పట్టించుకోకుండా నిమ్మకు నీరు ఎత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కుమ్మరి రాజకుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారత విద్యార్థి సమైక్య ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ రోజు మహాదేవపూర్ మండల కేంద్రంలో ఉన్నా గ్రామ గ్రామాన కరపత్రాలు, బ్యానర్లతో ప్రైవేట్ విద్యా సంస్థలు ప్రచారం చేస్తున్నారు. అదే విధంగా ఆయన మాట్లడుతూ మహాదేవపూర్ మండల లో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు గ్రామ గ్రామాన కరపత్రాలను ప్రచారం చేస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోకుండా ఉండడం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యహావరిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక దిక్కు ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలకు ఫీజులు దోపిడిని అరికట్టే విధంగా వేసిన క్యాబినెట్ కమిటీ కూడా ఎలాంటి ఉలుకు పలుకు లేకుండా పది రోజుల్లో విద్య సంస్థలు ప్రారంభం కాబోతున్న తరుణంలో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకువచ్చినప్పటికి దున్నపోతు మీద వాన పడుతున్నట్లుగా వ్యవహరిస్తున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల దోపిడీని అరికట్టే విధంగా ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. ఒక దిక్కు జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలను నిర్వహిస్తున్న ఇంటింటా క్యాంపెయిన్‌ను, వాడ వాడలా వాల పోస్టర్లను వీటిపై వెంటనే తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల, ఉపాధ్యాయులపై క్రిమినల్ కేసులు పెట్టాలని వారు డిమాండ్ చేశారు. లేనియెడల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు.



మా వాడాలో మా రాజ్యం ద్వారానే సబ్బండ కులాలకు రాజ్యాధికారం

-ఈనెల 28న జరిగే సభను విజయవంతం చేయాలి

-సీపీయూఎస్ఐ రాష్ట్ర కార్యదర్శి దైద వెంకన్న

నవతెలంగాణ-భూపాలపల్లి



మా వాడలో మా రాజ్యం ద్వారానే సబ్బండ కులాలకు రాజ్యాధికారం దక్కుతుందని సీపీయూఎస్ఐ రాష్ట్ర కార్యదర్శి దైద వెంకన్న అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని దళిత బహుజన శ్రామిక విముక్తి పార్టీ కార్యాలయంలో మారోజు వీరన్న 24వ వర్ధంతి కరపత్రం ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి సీపీయూఎస్ఐ రాష్ట్ర కార్యదర్శి దైద వెంకన్న ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ... మలిదశ తెలంగాణ ఉద్యమ నిర్మాత కులవర్గ పోరాటాల సిద్ధాంత క సీపీయూఎస్ఐ పార్టీ (దళిత బహుజన శ్రామిక విముక్తి) వ్యవస్థాపక కార్యదర్శి కామ్రేడ్ మారోజు వీరన్న అణగారిన కులాలకు ఐక్యం చేస్తూ రాజ్యాధికారం దిశగా ప్రయాణం చేయడం జరిగిందన్నారు. ఈ తరుణంలో అగ్రకుల బ్రాహ్మణ మనువాద కబంధ హస్తాల్లో నరహంతక చంద్రబాబు ప్రభుత్వం మారోజు వీరన్న బతికుంటే మా ప్రభుత్వం కూలిపోతుందని బెంబేలెత్తిపోయి ఆగమేఘాలతో మారోజు వీరన్న ను హైదరాబాద్ లో పట్టుకొని కరీంనగర్ జిల్లా గట్ల నర్సింగాపురం లో 1999 మే 16 తారీకు న బూటకపు ఎన్‌కౌంటర్‌తో రాజకీయ హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరన్న అమరత్వాన్ని పులికి పుచ్చుకొని ఎన్నో ప్రజా ఉద్యమాలు ఉవ్వెత్తున లేస్తున్నాయని గుర్తు చేశారు. మా గూడెంలో మా రాజ్యం మా తండాలో మా రాజ్యం మేము ఎంత మందిమో మాకు అంత వాటా అని ప్రజా ఉద్యమాలకు దిక్సూచి అయింద్రు. మారోజు వీరన్న ఇదే తరుణంలో గోదావరి లోయ ఉద్యమ రథశారాదులు మెరికలాంటి విప్లవ వీరులను బూటకపు ఎన్‌కౌంటర్ పేరు తో కామ్రేడ్ యాదన్న, స్వరూపక్కలతో పాటు రామేశన్న, సూర్యమన్నా, రంగన్న గోపన్న, నవీన్, కంబల్, అనిత కమలక్క, దనసారి సాంబన్న తో పాటు 150 మందిలో బూటకపు ఎన్‌కౌంటర్ పేరు తో రాజకీయ హత్య చేశారని గుర్తు చేశారు. అమరవీరులందరినీ స్మరించుకుంటూ. మే 28 వ తారీకున ములుగులో జరిగే మారోజు వీరన్న తో పాటు 150 మంది అమరవీరుల సంస్మారణ సభ ను విజయవంతం చేయాలని, కవులు, కళాకారులూ, అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీయూఎస్ఐ ములుగు భూపాలపల్లి జిల్లా కార్యదర్శి వావిలాల లక్ష్మణ్, దళిత బహుజన రాజ్యాధికార సమాఖ్య ములుగు భూపాలపల్లి జిల్లా కన్వీనర్, ధారకొండ శంకర్, బాబు తో పాటు తదితరులు పాల్గొన్నారు.



గ్రామ పంచాయతీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

సర్పంచ్, కార్యదర్శులకు వినతి పత్రం అందజేత

నవ తెలంగాణ-మల్హర్ రావు,

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీలో పనిచేస్తున్న గ్రామ పంచాయతీ వర్కర్లు కారోబార్, బిల్ కలెక్టర్స్, స్వీపర్స్, ఎలక్ట్రీషన్స్, వాటర్మేన్, డ్రైవర్లతోపాటు తదితరుల సమససమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర జేఏసీ కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా దశలవారీ పోరాటాలలో భాగంగా శనివారం మండల కేంద్రమైన తాడిచర్ల,ఆన్ సాన్ పల్లి గ్రామాల పంచాయతీ కార్యలయం వద్ద సర్పంచ్ లు,, పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీ తెలంగాణ కారోబార్,పంచాయతీ సిబ్బంది యూనియన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి సాదుల శ్రీకాంత్ ఆధ్వర్యంలో పంచాయతీ వర్కర్లు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ లో పని చేస్తున్న సిబ్బంది మొత్తాన్ని పర్మినెంటు చేయాలని కోరారు. పిఆర్సీ లో నిర్ణయించిన మినిమామ్ బేసిక్ ను వేతనంగా చెల్లించాలని ఈ లోపుగా జీఓ 60 ప్రకారం స్వీపర్లకు రూ 15600/-బిల్ కలెక్టర్ కారోబార్లకు రూ 19500 /- కంప్యూటర్ ఆపరేటర్లకు 22750/-వేతనంగా నిర్ణయించాలన్నారు. పంచాయతీ సిబ్బంది వేతనాల కోసం ప్రత్యేక గ్రాంటును కేటాయించి అందులోనుండే వేతనాలు చెల్లించాలని కోరారు. అలాగే మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దుచేయాలని, జీవో 51 ని సవరించాలని కారోబార్, బిల్ కలెక్టర్స్ కు స్పెషల్ స్టేటస్ కల్పించి పంచాయతీ అసిస్టెంట్లుగా నామకరణం చేయాలని పిఎఫ్, ఈఎస్ఐ ప్రమాద బీమా సౌకర్యం, 8 గంటల పనిదినాన్ని అమలుచేసి ఆదివారం, పండుగ సెలవులు, జాతీయ, అంతర్జాతీయ సెలవు దినాలను అమలుచేయాలి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కారోబార్ ఎండి అజ్మత్ ఆలీ, పంప్ ఆపరేటర్ రామిడి శ్రీనివాస్, జి సాగర్, జి రమేష్, రాజయ్య, ఓదెలు, గట్టయ్య, సమ్మక్క, ఓదెమ్మ డి సమ్మక్క, తదితరులు పాల్గొన్నారు.

రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ -మహాముత్తారం

పట్టాదారు పాసు పుస్తకంవచ్చి రైతు బంధుకు దరఖాస్తు చేయకుండాఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని మహ ముత్తారం ఏవో సతీష్ అన్నారు. శనివారం గతంలో తెలంగాణ పాస్ పుస్తకం వచ్చి ఇంకా రైతుబంధుకు దరఖాస్తు చేయకుండా ఉన్నవారు ప్రస్తుతం రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉన్నది. కావున రైతులు మీ యొక్క ఆధార్, పట్టా పాస్ పుస్తకం, బ్యాంక్ బుక్కు కాపీలతో మీ గ్రామ సమీపంలోని రైతు వేదికలో సంబంధిత ఏఈఓ ని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని ఏవో సతీష్ ఓ ప్రకటనలో తెలిపారు.



బిజెపి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

బిజెపి రాష్ట్ర నాయకుడు చందుపట్ల సత్యపాల్ రెడ్డి

నవతెలంగాణ-గణపురం

బిజెపి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చందుపట్ల సత్యపాల్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు జిట్టబోయున సాంబయ్య ఆధ్వర్యంలో మండల కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చందుపట్ల సత్యపాల్ రెడ్డి హాజరై మాట్లాడుతూ శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలని ఆయన పేర్కొన్నారు. కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పాల్గొన్నారు.

శాంతి సంఘం, మైనార్టీ ఇంటలెక్చువల్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్ల అందజేత

నవతెలంగాణ-హనుమకొండ





శాంతి సంఘం, వరంగల్ మైనార్టీ ఇంటలెక్చువల్ ఫోరం, ఆధ్వర్యంలో శనివారం ములుగు రోడ్డులోని ముస్లిం కమ్యూనిటీ సెంటర్లో జరిగిన కార్యక్రమంలో మైనార్టీ కుట్టుశిక్షణా కేంద్రం మహిళలకు కుట్టుమిషన్లు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్డీఎంఏ షాహిద్ మసూద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మైనార్టీ కమీషన్ మెంబర్‌గా ఎన్నికైన దర్శన్‌సింగ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ముందుగా ఐడియల్ పాఠశాల విద్యార్థులు శాంతి గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో శాంతి సంఘం అధ్యక్షులు డా.అనీష్ సిద్దికి, సెక్రటరీ సయ్యద్ ఇక్బాల్ మొహియుద్దీన్, శాంతి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ నర్సిరెడ్డికి మద్దతుగా దీక్ష



నవతెలంగాణ-మంగపేట

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి చేపట్టిన నిరసన దీక్షకు మద్దతుగా మండల కేంద్రంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు గొప్ప సమ్మారావు ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలియజేశారు. మండల కేంద్రంలోని కొమరం భీం విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం సమ్మారావు మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యల సాధనకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి చేస్తున్న నిరసన దీక్షకు జిల్లావ్యాప్తంగా యూటీఎఫ్ ఆధ్వర్యంలో సంఘీభావ నిరసనలు తెలిపినట్లు సమ్మారావు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా ముందుకు వచ్చి ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శులు కొండ చెంచయ్య, ములుకాల వెంకటస్వామి, మండలాధ్యక్షులు గుండం పురుషోత్తం, కార్యదర్శులు హన్మంతరావు, క్రిష్ణమూర్తి, సూరటి నాగేశ్వర్‌రావు, కాక సమ్మయ్య, ఇర్ప వేణు, అలెం శ్రీనివాస్, స్వరూప, జబ్బ రవి పాల్గొన్నారు.

నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపిన జెడ్పీ చైర్‌పర్సన్

నవతెలంగాణ-బయ్యారం



మండలంలోని బాల్యాతండ గ్రామానికి చెందిన అంగోత్ నందా నాయక్-కమల కూమారుడు అంగోత్ నేతాజీ నాయక్-సోనియా బాయి వివాహం అనంతరం శనివారం మహబూబాబాద్ జిల్లా జడ్పీ చైర్మన్ బిందు నాయక్ వారి ఇంటికి వెళ్లి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అంగోత్ కాంతి, బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు జర్పుల శ్రీను నాయక్, బోడ బాలు నాయక్, అంగోత్ శ్రీను, జర్పుల రాము, అంగోత్ సునిల్ కుమార్, జర్పుల భద్రు, మెడి శ్రీను, అజ్మీర కుమార్, గిరి నాయక్, గుగులోత్ చిరంజీవి, అజ్మీరా కోటి, అంగోతు పెద్ద సక్రు, అంగోత్ రవీందర్, బానోత్ మంత్రియ తదితరులు పాల్గొన్నారు.

రేణుక చౌదరికి కృతజ్ఞతలు తెలిపిన సురేష్

నవతెలంగాణ-బయ్యారం



కాంగ్రెస్ పార్టీ సత్తుపల్లి నియోజకవర్గ లీడర్షిప్ డెవలప్మెంట్ మిషన్ కో-ఆర్డినేటర్‌గా తన పేరును సిఫారస్ చేసి ఆశీర్వదించిన కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరిని మండలంలోని కొత్తపేటకు చెందిన సత్తుపల్లి కో-ఆర్డినేటర్, మాజీ మండల అధ్యక్షుడు వడ్లమూడి సురేష్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

సీతమ్మ చిత్రపటానికి ఘన నివాళి

నవతెలంగాణ-బయ్యారం



మండల కేంద్రానికి చెందిన పాత్రికేయులు వేమిశెట్టి గిరిబాబు అమ్మ, పాత్రికేయులు సతీష్ నాయనమ్మ వేమిశెట్టి సీతమ్మ ప్రథమ సంవత్సరీక కార్యక్రమంలో ఇల్లందు శాసన సభ్యురాలు బానోత్ హరిప్రియ నాయక్, మహబూబాబాద్ జిల్లా చైర్ పర్సన్ కుమారి అంగోత్ బిందు పాల్గొని సీతమ్మ చిత్రపటానికి పూలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, వైస్ ఎంపీపీ తాత గణేష్, ప్రధాన కార్యదర్శి బత్తిని రామ్మూర్తి గౌడ్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ గంగుల సత్యనారాయణ, శ్రీకాంత్ నాయక్, రైతు బంధు సమితి మండల అధ్యక్షులు రేఖ ఉప్పలయ్య యాదవ్, టౌన్ ప్రెసిడెంట్ చాపల వెంకన్న, సర్పంచ్ దనసరి కోటమ్మ, తమ్మిశెట్టి వెంకటపతి పాల్గొన్నారు.

ఇరిగేషన్ అధికారులపై చర్యలు తీసుకోవాలి

అఖిలపక్ష పార్టీల డిమాండ్



నవతెలంగాణ-బయ్యారం

రైతాంగానికి జీవనాధారమైన పెద్ద చెరువు నీరు వృథాగా పోతుంటే పట్టించుకోని ఇరిగేషన్ అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని గాంధీ సెంటర్ నందు సీపీఐ పార్టీ కార్యాలయంలో అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అఖిల పక్ష పార్టీ నాయకులు మాట్లాడారు. బయ్యారం పెద్ద చెరువు తూముల నుండి నీటిని వృథాగా వదులుతున్న ఇరిగేషన్ అధికారుల పై తక్షణమే తగు చర్యలు తీసుకోవాలన్నారు. బయ్యారం పెద్ద చెరువులో సుమారు 9 అడుగుల నీరు ఉండగా చేపలు పట్టడం కోసం గత 10 రోజులుగా నీటిని వదులుతున్న రైతులు, అఖిలపక్ష పార్టీ నాయకులు ఎన్ని సార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోకుండా తమ ఇష్టాను సారంగా ప్రవర్తించదడం చూస్తే పెద్ద మొత్తంలో చేపల పట్టే ముదిరాజుల నుండి ఐబీ అధికారులకు పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారుతున్నాయని, కాబట్టే వాళ్ళు నిమ్మకు నీరెత్తిన విధంగా అధికారులు ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. ప్రజా ప్రతినిధులు పట్టించుకున్న పాపాన పోవక పోవడం వారి కనుసన్నలలోనే జరుగుతున్నదని అఖిల పక్ష పార్టీల నాయకులు ఆరోపించారు. తక్షణమే తూములు నిలిపివేయకపోతే అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో రైతుల్ని ఏకం చేసి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్‌రెడ్డి, సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా రైతు కూలి సంఘం జిల్లా కార్యదర్శి బిళ్ళకంటి సూర్యం, సీపీఐ జిల్లా రైతు సంఘం సహాయ కార్యదర్శి బందెల కలింగ్‌రెడ్డి, సీపీఎం మండల రైతు సంఘం నాయకులు వళ్ళవుల వెంకన్న, సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యాదర్శి కోమిరే స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన పెంచుకోవాలి

ఎన్.శ్రీధర్ ఏడిఏ ఏటూర్‌నాగారం

ననవతెలంగాణ-గోవిందరావుపేట



మండల రైతులు వరికి బదులుగా ఆయిల్ ఫామ్ సాగు పై అవగాహన పెంచుకొని సాగు చేయాలని ఏడిఏ ఏటునాగారం ఎస్.శ్రీధర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి కే.జితేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీధర్ హజరై మాట్లాడారు. ఫామ్ ఆయిల్‌ను టన్నులకొద్దీ ఇతర దేశాల నుండి అవసరాల కోసం దిగుమతి చేసుకుంటూ ఉన్నామని దీనికై విదేశీ వారకద్రవ్యాన్ని కోల్పోవాల్సి వస్తున్న పరిస్థితుల్లో స్వదేశీ పరిజ్ఞానంతో ఆయిల్ ఫామ్ మనదేశంలోని సాగు చేసుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయన్నారు. వరికి బదులుగా ఫామ్ ఆయిల్ సాగు చేసుకునే రైతులు తమ అప్లికేషన్లను హార్టికల్చర్ అధికారులకు కానీ వ్యవసాయ అధికారికి కానీ ఇవ్వవచ్చని అన్నారు. ఎంపీపీ శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ వరి సాగు చేసి ఇబ్బందులు పడడం కన్నా మార్కెటింగ్ మంచిగా ధర ఉన్న ఆయిల్ ఫామ్‌ను సాగు చేసి లాభదాయకమైన పంటను సాగు చేయాలని రైతులకు సూచించారు. హార్టికల్చర్ అధికారిని కళ్యాణి మాట్లాడుతూ ఆయిల్ ఫాం సాగు మొక్కలు డ్రిప్ సబ్సిడీ ఎరువులు అంతర్గత పంటలు తదితర విషయాలను రైతులకు క్షుణ్ణంగా వివరించారు. ఏవో జితేందర్ రెడ్డి మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ సాగు డ్రిప్పు విషయంలో ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం, బీసీలకు 90 శాతం, ఓసీలకు 80 శాతం సబ్సిడీన పై అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాసరావు, ఆర్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కే.శ్రీనివాసరావు, ఏఈవోలు గోపాల్ రెడ్డి, ఫయాజ్, దాదా సింగ్ పాల్గొన్నారు.

ఔట్సోర్సింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజు

నవతెలంగాణ-మహబూబాబాద్



మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ సిబ్బందికి కనీస వేతనం 26 వేల రూపాయలకు పెంచాలని,వారి ఇతర సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజు డిమాండ్ చేశారు. శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆసుపత్రి సూపరిడెంట్ శ్రీనివాసరావుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజు మాట్లాడుతూ జిల్లా ఆస్పత్రిలో పనిచేసే శానిటేషన్, సెక్యూరిటీ గార్డ్స్, పేషెంట్ కేర్ సిబ్బందికి కనీస వేతనం పిఎఫ్, ఈఎస్ఐ పోను 12,096 రూపాయలు ఇవ్వాల్సి ఉండగా 11 వేల రూపాయలు మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. పెరుగుతున్నధరలకు అనుగుణంగా వేతనాన్ని 26వేల రూపాయలకు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రవీందర్, ఆర్.శేఖర్, మనోజ్, వసంత, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన శివకుమార్

నవతెలంగాణ-తొర్రూర్ రూరల్

గ్రామీణ ప్రాంతాల్లో క్రీడల పట్ల యువకులు ఆసక్తి పెంచుకొని వ్యక్తిగత వికాసానికి, ప్రాంతానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఎంపీడీవో సింగారపు కుమార్ అన్నారు శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఇటీవల నిర్వహించిన సీఎం కప్ జిల్లా స్థాయి పోటీల్లో సింగిల్స్ షటిల్ బ్యాడ్మింటన్‌లో తొర్రూర్ పట్టణ కేంద్రానికి చెందిన జలకం శివకుమార్ అత్యంత ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో గెలుపొంది, మంత్రి సత్యవతి రాథోడ్, జిల్లా కలెక్టర్ శశాంక చేతుల మీదుగా, మెడల్స్ ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించే సీఎం కప్ పోటీలకు మహబూబాబాద్ జిల్లా నుండి ఎంపికయ్యారు. పోటీల్లో పాల్గొనుటకు వెళ్లే సందర్భంలో ఆర్థికంగా క్రీడాకారున్ని ప్రోత్సహించి, శాలువాతో సత్కరించి, జిల్లా స్థాయిలో తొర్రూర్ మండలాన్ని అగ్రస్థానంలో నిలబెట్టిన శివకుమారును ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య ఎంపీడీవో కుమార్ అభినందించి, రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా ఇదే ప్రతిభ కనబరిచి జిల్లాకు మండలానికి ప్రాంతానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ గౌస్, షాట్ అధ్యక్షులు కష్టారెడ్డి, కోచ్ పి.బిక్షపతి, వెల్లి కట్టే సర్పంచ్ పుష్పలీల, సిబ్బంది శ్రీకాంత్, మోహిన్, రాజు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి : మంత్రి ఎర్రబెల్లి

నవతెలంగాణ-కొడకండ్ల

దేశంలోనే ఎక్కడ లేని విధంగా తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి సంక్షేమ పథంలో నడుస్తుందని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. శనివారం మండల కేంద్రంతో పాటు ఏడు నూతల గ్రామంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లాలని నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గంలో 2023 ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీ సాధించేందుకు కార్యకర్తలు నాయకులు సమన్వయంతో పనిచేస్తూ పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లాలి అన్నారు. త్వరలోనే అర్హులైన అందరికీ ఇండ్లు ఇండ్ల స్థలాలు రేషన్ కార్డులు మహిళా సాధికారత పెన్షన్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. నియోజవర్గం లోని ప్రతీ మండలంలో 100 కోట్ల రూపాయలతో అభివృద్ధి సంక్షేమ పథకాలను చేపట్టడం జరిగిందన్నారు. అనంతరం నర్సింగాపురం గ్రామంలో నూతన పంచాయతీ భవనానికి ఎస్సీ కమిటీ బహునానికి భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ డిసిసిబి వైస్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాము, ఈజీఎస్ డైరెక్టర్ యాకయ్య, మండల పార్టీ అధ్యక్షుడు రామోజీ, రైతుసమన్వయ సమితి మండల కన్వీనర్ వెంకటేశ్వరరావు, స్థానిక సర్పంచ్ మధుసూదన్,ఎంపీటీసీ విజయలక్ష్మీ, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రికి కాంగ్రెస్ నేతల వినతి

కొడకండ్ల మండలం అభివృద్ధి సంక్షేమ విషయంలో పూర్తిగా వెనుకబడి పోయిందని పట్టణ కాంగ్రెస నేతలు ఆరోపించారు. మండలంలో ఐటిఐ, పాలిటెక్నిక్ ప్రభుత్వ కళాశాల మంజూరు చేయాలని, అసంపూర్తిగా ఉన్న సబ్ రిజిస్టర్ బిల్డింగ్ పనులను త్వరితగా పూర్తి చేయాలని, అద్దె భవనంలో ఉన్న ఐసీడీఎస్ కార్యాలయానికి సొంత భవనం నిర్మించాలని, బ్లాక్ ఆఫీస్ చౌరస్తా నుండి జలాల్పురం రోడ్డు వరకు బీటీ రోడ్ నిర్మాణం చేపట్టాలని, బస్టాండ్ చౌరస్తా నుండి తిరుమలగిరికి నూతన రోడ్డు మార్గం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంత్రి ఎర్రబెల్లి దయార్‌రావుకు కాంగ్రెస్ నేతలు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు రవీందర్, నాయకులు బత్తుల వెంకన్న, మార్గం రవీందర్, వంశీ, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

పోడు పట్టాలలో రాజకీయ జోక్యాన్ని నివారించాలి : గౌని ఐలయ్య

నవతెలంగాణ-కొత్తగూడ

పోడు పట్టాలలో రాజకీయ జోక్యాన్ని నివారించి పోడు రైతులందరికి పట్టాలు ఇవ్వాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని పాలడుగు కృష్ణ స్మారక భవనంలో పిడిఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీశైలం అధ్యక్షతన న్యూడెమోక్రసీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ 2005 చట్టం ప్రకారం పోడు సేద్యం చేస్తున్న రైతులందరికీ పట్టా హక్కులు కల్పించాల్సి ఉండగా కొద్ది మందికి మాత్రమే పట్టాలిచ్చి గత పాలకులు చేతులు దులుపుకున్నారని విమర్శించారు. పోడు రైతులకు జరిగిన అన్యాయాన్ని సరి చేస్తామని చెప్పి 2014 జూన్ 2 తెలంగాణ విభాగం నాటికి పోడు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న వారందరికీ కుర్చీ వేసుకుని పోడు సమస్యను పరిష్కరిస్తానని రైతులకు హామీ ఇచ్చి నేటికీ రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోకపోగా గత పాలకులను తలదన్నే విధంగా మూడు రైతులను ఇబ్బందులకు గురి చేసారని ఆరోపించారు. అటవీశాఖ అధికారులు ఉసిగొలిపి పోడు భూములలో కందకాలు తవ్వడం, పంట బోర్లను, కరెంటు లైన్లను ధ్వంసం చేయడం, పంటలను నాశనం చేయడమే కాక రైతులను వారి భూములనుండి బలవంతంగా వెల్లగొట్టి హరితహారం మొక్కలు పెట్టించడం లాంటి విధ్వంసకర చర్యలకు పాల్పడ్డారన్నారు. రైతుల నుండి అటవీ శాఖ బలవంతంగా గుంజుకున్న పోడు భూములను రైతులకు అప్పగించాలన్నారు. ఓడు పట్టాల వివరాలను గ్రామసభల ముందు పెట్టాలని, క్లయిమ్‌లను దరఖాస్తుదారులకు అందజేసి అప్పీల్ అవకాశం కల్పించాలన్నారు. కేసీఆర్ ప్రభుత్వం పోడు రైతుల పట్టాల విషయంలో పారదర్శకత పాటించాలని, రాజకీయ జోక్యం లేకుండా పోడు రైతులందరికీ పట్టాలు ఇవ్వాలన్నారు. ఇష్టానుసారంగా కొద్దిమందికి పట్టాలిచ్చి మెజారిటీ పోడు రైతులకు అన్యాయం చేయడాన్ని అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా ఖండించాలని, పోడు రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి గుజ్జు దేవేందర్, మండల ప్రధాన కార్యదర్శి యాదగిరి యుగంధర్, పిడిఎస్‌యూ జిల్లా కార్యదర్శి బోనగిరి మధు, నాయకులు రాజం నరసయ్య, సిద్ధబోయిన జీవన్ తదితరులు పాల్గొన్నారు.



తరుగు లేకుండా ధాన్యం కోనుగోలు చేయాలి

వరి ధాన్యం బస్తాలు దగ్ధం చేసి నిరసన

నవతెలంగాణ-కేసముద్రం రూరల్

కాట్రపల్లి గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రం సెంటర్‌ను శనివారం సందర్శించి వారి సమస్యలు తెలుసుకొని తక్షణమే రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని టీపీసీసీ సభ్యులు గుగులోతు దసురు నాయక్, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు తోట వెంకన్న, కిసాన్ సెల్ మండల అధ్యక్షులు చీర వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ ఇటీవల గత కొద్ది రోజుల క్రితం అకాల వర్షాల వల్ల రైతులు పూర్తిగా నష్టపోగా ప్రభుత్వం అన్నదాతల ఆదుకోకపోగా నష్టపరిహారం చెల్లించక పండించిన కొద్ది గొప్ప వరి ధాన్యాన్ని అమ్ముకొనుటకు కొనుగోలు కేంద్రాలలో పోసుకొని రోజుల తరబడి పడి గాపులు కాసిన ధాన్యాన్ని కొనుగోలు చేయక కాంటాలు పెట్టక కాంటాలు పెట్టిన బస్తాలను సంబంధిత మిల్లులకు ఎగుమతి దిగుమతి చేయక రవాణా సౌకర్యం లేక రైతులను ఇబ్బందులు పెడుతున్నారని, గత నాలుగు ఐదు రోజుల క్రితం కాట్రపల్లి గ్రామ కొనుగోలు కేంద్రం నుండి రైతుల ధాన్యాన్ని లారీల ద్వారా ఎగుమతి చేసుకొని కరీంనగర్ మిల్లు వద్దకు తీసుకుపోగా మిల్లర్లు తేమ శాతం పేరుతోటి ఒక బస్తాకు నాలుగు కిలోల చొప్పున తరుగు తీస్తూ మిల్లర్లు రైతులను నష్టపరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గొప్పలు చెప్పుకుంటున్న కెసిఆర్ ప్రభుత్వం రైతుల పండించిన పంటను సకాలంలో కొనుగోలు చేసి రైతులను ఆదుకోకపోగా రైతులను నిర్లక్ష్యం చేస్తూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించక రైతులకు గత ప్రభుత్వాలు కల్పించిన అనేక సబ్సిడీలను ఎత్తివేస్తూ అన్ని విధాలుగా అన్నదాతలకు నష్టం చేస్తున్న, కెసిఆర్ తెలంగాణ ప్రభుత్వానికి రైతులు త్వరలోనే సరైన బుద్ధి చెబుతారని వారు హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతుల పండించిన పంటలను తక్షణమే కొనుగోలు చేసి ఒక కింటాకు వరి ధాన్యానికి 2500 రూపాయల చొప్పున మద్దతు ధర ప్రకటించాలని కోరుతూ వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరికొండ మల్లయ్య, పుట్ట ప్రభాకర్, బొంత సంపత్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు, పాల్వాయి అహల్య దేవి, శీలం నీలమ్మ, పరికిపండ్ల ఐలయ్య, జాటోతులాల్ సింగ్, శీలం యాదగిరి, బోదాస్ చంద్రయ్య, అంగోత్ వీరు నాయక్ సాంబార్ వీరస్వామి రైతులు పాల్గొన్నారు.



వీవోఏల సమస్యలు పరిష్కరించాలని ఛలో హైదరాబాద్

సీఐటీయూ మండల కార్యదర్శి ఈసంపల్లి సైదులు

నవతెలంగాణ-నెల్లికుదురు

వివిధ గ్రామాలలో వీవోఏలుగా విధులు నిర్వహిస్తున్న వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఈనెల 29న ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సీఐటీయూ మండల కార్యదర్శి ఈసంపల్లి సైదులు అన్నారు. మండల కేంద్రంలోని వీవోఏల నిరవధిక సమ్మె శనివారం నాటికి 41వ రోజు చేరుకున్న సమ్మెకు సంఘీభావం తెలిపి వారు మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలో గ్రామీణ అభివృద్ధి పథంలో ముందు నడిపించే వారదులు ఐకెపి వీవోఏలే అని అన్నారు. కానీ వారి శ్రమను గుర్తించకుండా ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంభించడం చాలా బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చెందారు. సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వ పాలనకు ఎంతో తోడ్పాటు అందించే దిశలో మహిళా గ్రూపులను సమీకరించి వారికి ఆర్థిక అభివృద్ధి చెందినందుకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించడంలో తిరిగి వాటిని కట్టించడం, రికవరీ చేయడంలో ఐకెపి వీవోఏలే అని,41 రోజులుగా సమ్మె నిర్వహిస్తున్న ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. తక్షణమే వారి డిమాండ్స్ పరిష్కరించే దిశగా ముందుకు సాగాలని అన్నారు. ఈ నెల 29వ తేదీన హైదరాబాదులో ఇందిరా పార్కు దగ్గర నిర్వహించే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని వీవోఏలకు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షులు హనుమంతు ఉపేందర్, లింగయ్య, నిమ్మకంటి రాధిక, పెరమాల మంజుల, టి.మంజుల, అక్కెర ఉష, శ్రీనివాస్, రమేష్, శ్వేత, స్వాతి, స్వప్న, హైమా, కవిత, యాకమ్మ, నాసిహత్ బేగం, విజయలక్ష్మి, ఆదిలక్ష్మి, ఉమా, సుమతి, లక్ష్మి, రేణుక, చింతకుంట్ల ఉపేందర్, బిరు యాకయ్య, వివిధ గ్రామాల వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.





కార్పోరేట్ ధీటుగా ప్రభుత్వ బడులు

తహసీల్దార్ యోగేశ్వరరావు, ఎంపీడీవో, ఎంఈవో

నవతెలంగాణ-నెల్లికుదురు

కార్పోరేటర్ బడులకు ధీటుగా ప్రభుత్వ బడుల్లోనే విద్య అందుతుందని ఎంఈఓ గుగులోతు రాము, తహసీల్దార్ యోగేశ్వరరావు, ఎంపీడీవో శేషాద్రిలు అన్నారు. మండల కేంద్రంలోని పార్వతమ్మ గూడెం ఎంపీ యుపిఎస్ ప్రభుత్వ పాఠశాల బడిబాట పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాల కంటే ఎక్కువగా ప్రభుత్వ బడులోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ఈ పార్వతమ్మ గూడెం పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు డిజిటల్ క్లాసులు అందిస్తున్నామన్నారు.అంతేకాకుండా వారికి ఉచితంగా విద్యను ఉచితంగా పాఠ్యపుస్తకాలు, రెండు జతుల దుస్తులను వారికి కావాల్సిన నోట్ బుక్స్, విద్యార్థులకు కావలసిన మౌలిక వసతులను ఈ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేశామన్నారు. మండలంలోని ఈ పార్వతమ్మ గూడెం పాఠశాల చుట్టు ప్రక్కల గ్రామాలలో బడిబాటపై అవగాహన కల్పించి తల్లిదండ్రులకు ఈ పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఎక్కడికో దూర ప్రాంతాలకు వెళ్లి వేల రూపాయలు ఖర్చుపెట్టి ఆర్థికంగా నష్టపోకుండా ఉండేందుకు ఈ పాఠశాలలో డిజిటల్ క్లాసుల ద్వారా నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. దీనిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలంలోని భారతమ్మ గూడెం గ్రామ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కోసం ఈ ప్రచారాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సిహెచ్.జీవన్ కుమార్, ప్రధానోపాధ్యాయుడు నరేందర్ కుమార్, మండల వ్యవసాయ అధికారి నెలకుర్తి రవీందర్ రెడ్డి, మండల పంచాయతీ అధికారి బండారు పార్థసారథి, సిఆర్‌పిటి వీరస్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రవేట్ విద్యాసంస్థల హోర్డింగ్స్, ఫ్లెక్సీలు తొలగించాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సాద రాకేష్

నవతెలంగాణ-ములుగు



వెంకటాపూర్ మండల కేంద్రంలో అక్రమంగా ఏర్పాటు చేసిన ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థల హోర్డింగ్లను ఫ్లెక్సీలను తొలగించాలని ఎస్ఎఫ్ఐ ములుగు జిల్లా ఉపాధ్యక్షులు సాద రాకేష్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా రెచ్చిపోతున్నాయని, హోర్డింగ్లను ఫ్లెక్సీలను ప్రధాన కూడళ్ళలో పెద్దఎత్తున ఏర్పాటు చేసి ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఇంత జరుగుతున్న కాని జిల్లా విద్యాశాఖ అధికారులు పట్టించుకోనట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలను దెబ్బతీయడమే లక్ష్యంగా పెట్టుకున్న అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా మండలం కేంద్రంలో విచ్చలవిడిగా హోర్డింగ్ ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి దొంగ ప్రచారాలు ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు చేస్తున్నారన్నారు. వారు తల్లిదండ్రులను మభ్యపెడుతూ విద్యాసంస్థల జాయిన్ కావాలని ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఈ విషయాలపై జిల్లా, మండల విద్యాశాఖ అధికారులు స్పందించి మండల కేంద్రంలో అక్రమంగా ఏర్పాటు చేసిన హోర్డింగ్లను, ఫ్లెక్సీలను పెట్టిన యాజమాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా పంచాయతీ కార్యదర్శి వెంటనే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో సమరశీల పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రమేష్, లక్ష్మణ్, బాలు, సాయి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ అసెంబ్లీ ఇంఛార్జి పసులాది ముకేష్ తొలగింపు

నవతెలంగాణ-ములుగు

గోవిందరావుపేట్ మండలం చల్వాయి గ్రామానికి చెందిన బీఎస్పీ అసెంబ్లీ ఇంఛార్జి పసులాది ముఖేష్‌ను, ఆ పదవి నుండి తొలగిస్తున్నట్లు బీఎస్పీ జిల్లా అధ్యక్షులు శనిగరపు నరేష్‌కుమార్ శనివారం ప్రకటించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎస్పీ నియమాలకు విరుద్ధంగా పని చేసినందున, వారిని ఈ పదవి నుండి తొలగిస్తున్నట్లు తెలిపారు. పార్టీ నిర్ణయానికి, సిద్ధాంతానికి వ్యతిరేకంగా పని చేసే వారిపై చర్యలు తప్పవన్నారు. బీఎస్పీ మహనీయుల ఆశయాలు లక్ష్యంగా బహుజన రాజ్యధికార సాధన కోసం పని చేస్తుందని ఆయన తెలిపారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవు

వ్యవసాయ శాఖ ఉపాసంచాలకులు పరశురాం నాయక్

నవతెలంగాణ-పాలకుర్తి



ఎరువుల దుకాణాల నిర్వహకులు నకిలీ విత్తనాలను విక్రయిస్తే చర్యలు తప్పవని పాలకుర్తి సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ ఉపసంచాలకులు అజ్మీర పరశురాం నాయక్ హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలో పలు ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారిని పెద్దిరెడ్డి వరలక్ష్మితో కలిసి స్పెషల్ టాస్క్ ఫోర్స్ టీం తనిఖీ నిర్వహించారు. ఎరువుల దుకాణాల్లో రికార్డులతో పాటు స్టాక్ రిజిస్టర్, ధరల పట్టికను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు ఖరీఫ్ సీజన్లో ఎరువుల విత్తనాల కోసం ఎదురు చూస్తారని తెలిపారు. ఆరుగాలం కష్టపడే రైతుకు నకిలీ విత్తనాలు అందజేసి మోసం చేయరాదని సూచించారు. నకిలీ విత్తనాలను సరఫరా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఎరువుల దుకాణాల యజమాని సంబంధిత రికార్డులను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని సూచించారు. నకిలీ విత్తనాల సరఫరా పై రైతుల నుండి సమాచారం అందితే పిడి యాక్టివ్ నమోదు చేస్తామని స్పష్టం చేశారు. తనిఖీల్లో స్పెషల్ టాస్క్ ఫోర్స్ టీం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి సన్మానం

నవతెలంగాణ-బచ్చన్నపేట



కేంద్రమంత్రి శర్బానంద సోనావాల్‌ను హోటల్ తాజ్ కృష్ణలో జరిగిన సమావేశంలో వాస్విక్ ఫౌండేషన్ చైర్మన్ నరేష్ కుమార్ పాల్గొని మంత్రిని సన్మానించారు. ఈ సందర్భంగా వాస్విక్ ఫౌండేషన్ సేవా సంస్థ ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలను వివరించారు. ఈ సదర్భంగా మినిస్టర్ శర్బానంద సోనవాల్ మాట్లాడుతూ సమాజం పట్ల ప్రజల పట్ల సేవాభావం కలిగిన వారిని సేవ చేసే వాళ్ళని ఎల్లప్పుడూ మనస్పూర్తిగా అభినందిస్తానని అలాగే నా వంతు సహాయ సహారాలతో చేయూత అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సుప్రీం కోర్టు అడ్వకేట్ రవీంద్రనాథ్, ఏపీ బీజేపీ సెక్రెటరీ శివ, నేషనల్ కిసాన్ కో-ఆర్డినేటర్ నవనీత్ సింగ్ పాల్గొన్నారు.

కల్తీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్ : సీఐ నాగబాబు

నవతెలంగాణ-బచ్చన్నపేట



కల్తీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్ కేసులను నమోదు చేస్తామని సీఐ నాగబాబు తెలిపారు. శనివారం మండల కేంద్రంలో వ్యవసాయ అధికారిని ఏడిఓ వీమతో కలసి మన గ్రోమోర్ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేపట్టారు.

సామాజిక సేవకుడు సందబాబుకు చేయూత

నవతెలంగాణ-ములుగు



విద్య ఫౌండేషన్, వరంగల్ కవి మిత్రులు ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం నారాయణపూర్ గ్రామంలో ఉంటున్న జర్నలిస్టు, కవి, సామాజిక వేత్త సందబాబు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడని తెలుసుకొని అతడి చికిత్స నిమిత్తం 20 వేల రూపాయల చేయూతను శనివారం అందించారు. ఈ సందర్భంగా కవి, విద్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు బిల్ల మహేందర్, అడ్వకేట్ రవి కుమార్‌లు మాట్లాడుతూ సందబాబు సమాజానికి అనేక సేవలు చేశారని, ముఖ్యంగా ఒంటరి మహిళల హక్కుల కోసం నిత్యం పోరాటం చేస్తున్నాడని అన్నారు. కవిగా, రచయితగా రచనలు చేస్తూనే సమాజం కోసం అవిరాళంగా కృషి చేశాడని అన్నారు. సందబాబు త్వరగా కోలుకోవాలని, ప్రస్తుతం క్లిష్ట పరిస్థితులలో ఉన్న అతడిని మానవతా దృక్పథంతో అందరూ ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. సహాయం అందించిన కాజీపేట ఏసిపి శ్రీనివాసుకు ఫౌండేషన్ సభ్యులకు, కవులందరికి వారు కృతజ్ఞతలు తెలియజేశారు. సందబాబును కలిసిన వారిలో కవులు నాగబెల్లి జితేందర్, సిరాజుద్దీన్, బాల బోయిన రమాదేవి, జ్యోతిరాణి, కలకోట్ల నరేందర్ తదితరులు ఉన్నారు.

ఉపాధి పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం

నవతెలంగాణ-పాలకుర్తి రూరల్



ఉపాధి హామీ పని ప్రదేశాల్లో కాసేపు సేద తీరేందుకు నిలువ నీడ లేక పెరుగుతున్న ఎండ తీవ్రతతో కూలీలు అల్లాడుతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కాకర్ల బాబు. కాకర్ల పద్మ అన్నారు. శనివారం పాలకుర్తి మండలంలోని మంచుప్పుల గ్రామంలో ఉపాధి హామీ పని ప్రదేశాన్ని వ్యవసాయ కార్మిక సంఘం బృందం సందర్శించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెలల తరబడి చేసిన పనికి డబ్బులు రాక కూలీలు తమ కుటుంబాలను పోషించుకోలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని. ఇప్పటికైనా ప్రభుత్వం కూలీలకు రావాల్సిన పెండింగ్ డబ్బులు తక్షణం చెల్లించి పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నో పోరాటాల త్యాగాల ఫలితంగా గ్రామీణ పేదలకు వ్యవసాయ కూలీలకు పని గ్యారంటీ కోసం వలసల నివారణ కోసం వచ్చిన గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేయాలని చూస్తున్న కుట్రలను తిప్పి కొట్టాలన్నారు. గ్రామీణ కుటుంబంలో పని కొరిన వారికి ఆ గ్రామ పరిధిలో పని దినాలు కల్పించాలన్నారు. ఉపాధి హామీ 200 రోజులు పని కల్పించి రోజుకు 600 రూపాయలు ఇవ్వాలన్నారు. పోరాడి సాధించుకున్న చట్టాన్ని కాపాడుకోవడం కోసం గ్రామీణ పేదలంతా ఐక్యం కావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో కే.సోమయ్య, జి.సోమ నరసయ్య, చంద్రయ్య, జి.ఎల్లయ్య పరశురాములు, వెన్నెల, ఎల్లమ్మ, మైసమ్మ, బుచ్చమ్మ, సాలయ్య తదితరులు పాల్గొన్నారు.

అటవీ క్షేత్ర అధికారిని సస్పెండ్ చేయాలి

నవతెలంగాణ-కొత్తగూడ



అక్రమ సంపాదనే ధ్యేయంగా పనిచేస్తూ తన సిబ్బంది అయిన ఎఫ్ఎస్ఓ, ఎఫ్‌బిఓ, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బందిని పావులుగా వాడుకుంటూ అక్రమ సంపాదనకు పాల్పడుతున్న కొత్తగూడ అటవీ క్షేత్ర అధికారిని సస్పెండ్ చేయాలని తుడుం దెబ్బ రాష్ట్ర సాంస్కృతిక కార్యదర్శి ఆగిపోయిన రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక గ్రామపంచాయతీ ఆవరణలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలూరి రాజు అధ్యక్షతన ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కొత్తగూడ అటవీశాఖ కార్యాలయానికి ఎఫ్ఆర్వోగా వజహాత్ వచ్చిన నాటి నుండి మండలంలో అనేక వివాదాలు కొనసాగిస్తూ ప్రజల స్వేచ్ఛను కాల రాస్తూ ప్రజలపై విచక్షణారహిత కార్యకలాపాలను అనుసరిస్తూ తన సిబ్బందితో వేధింపులకు పాల్పడుతూ ఏలాంటి అభివృద్ధి పని చేయాలన్న ఎక్కడలేని అభ్యంతరాలు కలగజేస్తూ డబ్బులు ముట్టచెప్పనీదే అట్టి అభివృద్ధి పనులు చేయనిచ్చే పరిస్థితి లేదని ఆరోపించారు. ఇప్పటికైనా తక్షణమే జిల్లా అటవీశాఖ అధికారి స్పందించి ఎఫ్ఆర్ఓ పై విచారణ చేపట్టి అక్రమాలను బయటకు తీసి దుర్వినియోగమైన నిధులను రికవరీ చేసి శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో తుడుం దెబ్బ ఆధ్వర్యంలోఎఫ్ఆర్ఓ కార్యాలయం ముట్టడి చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిద్ధబోయిన జీవన్, సువర్ణపాక నరసయ్య, బీరబోయిన సమ్మయ్య, సిద్ధ బోయిన లక్ష్మీనారాయణ, మునేష్ పాల్గొన్నారు.

ములుగు డీఎస్పీ రవీందర్‌కు సన్మానం

నవతెలంగాణ-ములుగు



ములుగు నూతన డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఎన్.రవీందర్‌ను ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షులు గడ్డం భద్రయ్య మాదిగ ఆధ్వర్యంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఊట్ల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
ములుగు, జనగామ, మహబూబాబాద్
ఆదివారం 28 మే 2023

గోల్డెన్ జూబ్లీ వార్షికోత్సవానికి విరాళం



నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్

డివిజన్ కేంద్రంలోని నిర్మలా మాత చర్చి 50వసంతాల గోల్డెన్ జూబ్లీ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మాజీ డిప్యూటీ సీఎం, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి శనివారం 50 వేల రూపాయల విరాళం చర్చి కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ అన్ని మతాలను గౌరవిస్తూ, సముచిత ప్రాధాన్యత కల్పిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో చర్చి సంఘపెద్దలు, జూబ్లీ వేడుక కమిటీ సభ్యులు చింత జాకోబు, కడియం యువసేన నాయకులు జీడి ప్రసాద్, కడియం అభిమానులు సింగపురం రవి, సింగపురం గడ్డం ఎల్లయ్య, సింగపురం బలగం వెంకటయ్య, సింగపురం ఎల్లేష్, కోడిదేటి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి : ఎంపీపీ



నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

గ్రామాభివృద్ధికి ప్రజలంతా సహకరించాలని వైస్ ఎంపిపి చల్లా సుధీర్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని తాటికొండ గ్రామంలో సర్పంచ్ చల్లా ఉమా సుధీర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన గ్రామసభలో మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య ఆదేశానుసారం అనేక అభివృద్ధి సంక్షేమ పనులు ప్రజాయోగ్యంగా జరిగాయని అన్నారు. గ్రామ ఆదాయ, వ్యయ వివరాలు గూర్చి సభా సమక్షంలో వినిపించారు. ఎండా కాలంలో తాగు నీటి ఎద్దడిని నివారించేందుకు, రైతుల పక్షాన వరి ధాన్యం కొనుగోలు త్వరితగతిన పూర్తి చేయాలని, అంతే కాకుండా తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు ఏర్పాటు కోసం చర్చించారు. గ్రామ ప్రగతికై ఎన్నో కార్యక్రమాలు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, పంచాయితీ కార్యదర్శి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీ బ్రీజ్ భూషణ్‌ను అరెస్ట్ చేయాలి

సీఐటీయూ డిమాండ్



నవతెలంగాణ-ములుగు

రెజిలింగ్‌లో అంతర్జాతీయ స్థాయిలో అనేక కీర్తి పతకాలు సాధించిన భారత మహిళా రెజ్లర్ల పై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ, రెజ్లర్‌ల సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని ఢిల్లీలో గత నెల రోజులుగా ఆందోళన చేస్తున్న మల్ల యోధులకు మద్దతుగా సీఐటీయూ ఆధ్వర్యంలో సంఘీభావంగా కలెక్టర్ కార్యాలయం ముందు శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మహిళా రెజ్లర్లుపై లైంగిక వేధింపులకు పాల్పడిన బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలని, పోరాడుతున్న వారిపై ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడడం మానుకోవాలని హితవు పలికారు.బిజెపి ఎంపీ అభినవకీచకుడు అయినా బ్రిజ్ భూషణ్ మహిళా రెజ్లర్లపైన అనేక సార్లు లైంగిక వేధింపులకు పాల్పడ్డారని, తిరగబడిన రెజ్లర్లపై కక్ష సాధింపు చర్యలకు, అనైతిక చర్యలకు పాల్పడుతున్నాడని ఆయనను ప్రభుత్వం ఎంపీ పదవి నుండి సస్పెండ్ చేయాలని, రెజ్లర్ల సమాఖ్య అధ్యక్షుడి పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. మహిళా రెజ్లర్లు కొన్ని నెలలుగా పోరాటం చేస్తుంటే బిజెపి ప్రభుత్వం, ప్రధాన మంత్రి ఏమాత్రం స్పందించకపోవడం మహిళలపై ప్రధాని ఉన్న అభిప్రాయాలు బయటపడ్డాయ అన్నారు. భేటీ బచావో బేటి పడావో నినాదం ఇచ్చిన మోడీ మహిళా రెజ్లర్ల గురించి వారికి న్యాయం చేయాలనే ఆలోచన రావడంలేదా..?అని ప్రశ్నించారు. తక్షణమే బ్రిజ్ భూషణ్ అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, రెజ్లర్లకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు కలువల రవీందర్, సీఐటీయూ నాయకులు చిట్టినేని శ్రీనివాస్, కాట నర్సింగరావు, సత్యనారాయణ, నమని శంకర్, కృష్ణ, ఎట్టి నరేష్, రమేష్, పల్నాటి కృష్ణ పాల్గొన్నారు.

ఆరోపణలు అర్థరహితం : సర్పంచ్ పద్మ



నవతెలంగాణ-పాలకుర్తి

వావిలాల గ్రామానికి చెందిన నాలుగవ వార్డు సభ్యురాలు సుడిద పద్మ తనతోపాటు తన భర్త పై చేసిన ఆరోపణలు అర్ధరహితమని వావిలాల సర్పంచ్ గంట పద్మ అన్నారు. ఈనెల 26న వార్డు మెంబర్ పదవికి రా జీనామా చేస్తున్నానని ఎంపీడీవోకు రాజీనామా పత్రాన్ని అందజేయడంతో పాటు తనభర్తపై పలు ఆరోపణలు చేయడానికి ఆమె తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పద్మ మాట్లాడుతూ వార్డు సభ్యురాలి భర్త సుడిదా వీరన్న ఉపాధి హామీలు ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తూ కూలీల వద్ద డబ్బులు వసూలు చేసేవాడని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్ల వ్యవస్థను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో పాటు తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆదేశాలు జారీ చేయడంతో సూడిద వీరన్నను ఫీల్డ్ అసిస్టెంట్‌గా తీసుకోరాదని గ్రామపంచాయతీ తీర్మానం చేసి సంబంధిత శాఖలకు తీర్మానం పత్రాలను అందజే సిందని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్‌గా వీరన్నను ఉపాధి హామీ కూలీలు సైతం వద్దని స్పష్టం చేశారని తెలిపారు. ప్రతీ ఉపాధి హామీ పనిలో డబ్బులు వసూలే లక్ష్యంగా పెట్టుకున్నాడని విమర్శించారు. ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేసిన వీరన్న ప్రవర్తన బాగాలేక 2022 ఆగస్టులో గ్రామ సభ తీర్మానం ద్వారా తీసివేయడం జరిగిందన్నారు. అప్పటి నుండి నాతో పాటు నా భర్త పై కక్ష పెంచుకున్నాడని విమర్శించారు. 4వ వార్డు సభ్యులుగా గత మూడున్నర సంవత్సరాలుగా గ్రామ సభ సమావేశాలకు రాలేదని అన్నారు. సర్పంచ్‌గా తన భర్త అభివృద్ధి కార్యక్ర మాలతో పాటు గ్రామ అభివృద్ధికి చేదోడువాదోడుగా సహకరిస్తున్నాడు తప్ప రాజకీయాలు చేయడంలేదని స్పష్టం చేశారు. ఉపాధి హామీ కూలీల విజ్ఞప్తి మేరకు ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధుల్లోకి తీసుకోకపోవడంతో చివరి అస్త్రంగా భార్య రాజీనామాతో ఆరోపణలు చేస్తున్నాడని విమర్శించారు. ఫీల్డ్ అసిస్టెంట్‌గా తీసుకొమ్మని మంత్రి ఎర్రబెల్లితో పాటు అధికారుల వద్దకు వెళ్లిన గ్రామ సభ తీర్మానం మేరకు మెదులుకోవాలని అధికారులు సూచించారని తెలిపారు.

కుల వృత్తులకు ప్రాధాన్యత : మంత్రి ఎర్రబెల్లి



నవతెలంగాణ-పాలకుర్తి

తెలంగాణలోనే కుల వృత్తులకు సీఎం కేసీఆర్ అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును మేదరి కులస్తులు కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. స్పందించిన మంత్రి ఎర్రబెల్లి మేదరి కులస్తులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని వెనుకబడిన కులస్తులైన మేదరి కులస్తులపై సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ చూపుచున్నారని తెలిపారు.ప్రతి సామాజిక వర్గానికి సీఎం కేసీఆర్ లక్ష చొప్పున తెలంగాణ ప్రభుత్వం తరపున అందజేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో వెదురు సొసైటీల బకాయిలు రద్దుకు తక్షణ చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. జనగామ జిల్లా కేంద్రంలో మేదరి సంఘ భవనానికి స్థల సేకరణ, భవన నిర్మాణానికి ఐదు లక్షలు మంజూరు చేస్తామన్నారు. అర్హులైన మేదరులకు పెన్షన్ ఇప్పించుటకు సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్తానని అన్నారు. వెదురు సొసైటీలు పునరుద్ధరణకు సంబంధిత మంత్రి, అధికారులతో సంప్రదించి తక్షణ చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా మేదరి సంఘం అధ్యక్షులు నీలం సుధాకర్, గౌరవ అధ్యక్షులు సత్యనారాయణ, జిల్లా నాయకులు కల్లూరి బిక్షపతి, వాసం యాకుబ్, మస్నా సాంబయ్య, రేపాల సారంగం, శేర్ల విజేయుడు, శేర్ల సోమయ్య, రేపాల అశోక్, రేపాల శ్రీను, పెద్ది వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు శిక్షణ కేంద్రాలు

ఐకేపీ ఏపీఎం ఆర్. రమణాచారి

నవతెలంగాణ-పాలకుర్తి రూరల్

మహిళా సాధికారిక మరో మైలురాయి కుట్టు శిక్షణ కేంద్రాలని ఐకెపి ఎపిఎం ఆర్.రమణాచారి అన్నారు. మండల కేంద్రంలో శనివారం వారు మాట్లాడుతూ మండలంలోని 36 గ్రామపంచాయతీలలో 600 మంది మహిళలకు ఐకెపి ద్వారా కుట్టు శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వము పైలట్ ప్రాజెక్టు రూపొందించిందన్నారు. ఇప్పటివరకు 200 మంది మహిళలకు నెల రోజులపాటు శిక్షణ ఇచ్చి కుట్టు మిషన్లు అందజేశామన్నారు. జూన్ మూడవ తేదీ నాటికి రెండో బ్యాచ్ శిక్షణ పూర్తి అవుతుందనిశిక్షణ అనంతరం వారికి కూడా కుట్టుమిషన్లు అందజేయడం జరుగుతుందన్నారు. జూన్ ఆరవ తేదీ నుండి తుది విడత మహిళల కుట్టు శిక్షణ కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు.ఇట్టి కుట్టు మిషన్ శిక్షణతో స్వయం ఉపాధి పొందుటకు ఒక మంచి సువర్ణ అవకాశమని వారన్నారు. శిక్షణలో మంచి నైపుణ్యం ఉండి, ఆసక్తిగల వారందరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశం కూడ ప్రభుత్వం కల్పించబోతుందని వారు వివరించారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పనగా ఉపయోగపడే ఇట్టి అవకాశం అందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

స్వర్ణ జయంతి ఎక్స్‌ప్రెస్ రైలు భోగిలో పొగలు



నవతెలంగాణ-గార్ల

దిగువన లైన్ పై వస్తున్న ఓ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో పొగలు వచ్చి సుమారుగా 30 నిమిషాల పాటు రైలు ఆగిన సంఘటన స్థానిక రైల్వే స్టేషను సమీపంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం హజారత్ నిజాముద్దీన్ నుండి త్రివేంద్రం వెళ్తున్న స్వర్ణ జయంతి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు నెంబర్ 12644 లో భోగి నెంబర్ బి-2 ఎసి కోచ్‌లో బ్యాటరీల సాంకేతిక లోపంతో రాంపురం సమీపంలోకి రాగానే ఒక్క సారిగా పొగలు రావడంతో ప్రయాణికులు భయాందోళనకు గురి కాగ వెంటనే అప్రమత్తం అయిన డ్రైవర్ రైలును నిలిపివేశారు. రైలు ఆగిపోవడంతో వెంటనే ప్రయాణికులు భయాందోళనలకు గురై రైలు నుండి దిగి కొంత దూరం పరుగులు తీసినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. వెంటనే రైల్వే డ్రైవర్, గార్డ్‌లు సాంకేతిక లోపాన్ని సరి చేయగా ప్రయాణికులు ఊపిరి పీల్చుకొని రైలు ఎక్కారు.

మెడికల్ కళాశాల పనులు వేగవంతం చేయాలి : కలెక్టర్



నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

జిల్లాలో ఇప్పటికే మెడికల్ కళాశాల నిర్మాణం కోసం అన్ని ఏర్పాట్లు చేశామని, తాత్కాలిక వసతి కోసం హాస్టల్ తరగతి గదులు, ల్యాబ్ నిర్వహణ ఏర్పాట్లు చేశామని, మెడికల్ కళాశాల నిర్మాణం పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సిహెచ్ శివలింగయ్య అన్నారు. శనివారం హైదరాబాదు నుండి మెడికల్ అండ్ హెల్త్ సెక్రెటరీ రిజ్వి, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ రమేష్ రెడ్డి రాష్ట్రంలో నూతన మెడికల్ కాలేజీల్లో మౌలిక సదుపాయాల కల్పన, జరుగుతున్న పనిల పై సంబంధిత జిల్లాల అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ రెడ్డి, రిజ్వి రజ్వి మాట్లాడుతూ జిల్లాలో మెడికల్ కాలేజీలో వచ్చే సంవత్సరం తరగతుల ప్రారంభం నేపథ్యంలో ఇప్పటికే సూచించిన పనులను నిర్మాణం, వసతుల కల్పన, మెడికల్ ఇంజనీరింగ్ సిబ్బందితో కలిసి త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే సంబంధిత జిల్లా కలెక్టర్ల ద్వారా తెలియపరచాలని కోరారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి ఈ సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ సిహెచ్.శివలింగయ్య మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరగా పనులను పూర్తి చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాలరావు, ఏరియా హాస్పిటల్ సూపరింటెం డెంట్ సుగుణాకర్ రాజు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రశాంత్, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ రవీందర్, డాక్టర్ అశోక్, వైద్య కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

లక్ష్య, ముస్కాన్ పథకంలో జిల్లాకు మొదటి స్థానం : కలెక్టర్

సెంట్రల్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ మంత్రిత్వ శాఖ రాష్ట్రంలోని అన్ని ఏరియా మాత శిశు సంరక్షణ, కేంద్ర ఆస్పత్రుల్లో క్వాలిటీ లేబర్ రూమ్, ఆపరేషన్ థియేటర్స్ నిర్వహణ, వైద్యుల సేవ కోసం వచ్చేవారికి సంబంధించిన అత్యుత్తమ సేవలు అందించే సామర్థ్యం కలిగిన ఆస్పత్రుల్లో లక్ష్య, ముస్కన్ పథకాలలో తెలంగాణలో జనగామ జిల్లా మొదటి స్థానంలో ఉందని కలెక్టర్ సిహెచ్ శివలింగయ్య సంబంధిత వైద్యాధికారులను అభినందించారు. ప్రజలకు ఉత్తమమైన నాణ్యమైన సేవలు అందించి వారి మన్నన పొందాలని కలెక్టర్ సూచించారు.

ఉపాధ్యాయ విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యం

టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రంజిత్ కుమార్



నవతెలంగాణ-జనగామ

ఉపాధ్యాయ,విద్యారంగాల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తూ, మాటలతో మభ్యపెడుతుందని, చేతలు శూన్యమని టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కానుగంటి రంజిత్ కుమార్ విమర్శించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి హైద్రాబాద్‌లో చేస్తున్న నిరసన దీక్షకు మద్దతుగా శనివారం జనగామ జిల్లా కేంద్రంలో నిరసన ర్యాలీ నిర్వహించడం జరిగింది.అనంతరం ఆసంఘం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రంజిత్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా రంగం పట్ల ప్రభుత్వానికి సరైన దక్పథం లేదని 8 సంవత్సరాలు అయినా ప్రమోషన్స్ లేవని, 5 సంవత్సరాలుగా బదిలీలు లేవని, కేవలం ఆర్థికపరమైన అంశంగానే చూస్తుంది తప్ప, విద్యలో నాణ్యత పెరుగుతుందనే ఆలోచన లేదని, మోడల్ స్కూల్స్ ప్రారంభం అయినప్పటినుండి ఇప్పటివరకు ప్రమోషన్స్ కానీ బదిలీలు కానీ నిర్వహించలేదని విమర్శించారు. వేతనాలు అందజేయడంలో కూడా అలసత్వం ప్రదర్శిస్తూ 10నుండి 15 వరకు కూడా వేతనాలు రాని దుస్థితి నెలకొందని, ఉద్యోగులు దాచుకున్న సొమ్మును వారి అవసరాలకు ఇవ్వకుండ ఈ కుబేర్‌లో పెండింగ్‌లో పెడుతుందని వెంటనే మార్చ్ వరకు ఉన్న పెండింగ్ బిల్స్ అన్నింటినీ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ యుఆర్ఎస్‌లో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు మినిమం బేసిక్ పే ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరారు. ఉపాధ్యాయ, విద్యా రంగ వికాసం కొరకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అనేక పర్యాయాలు ప్రాతినిధ్యాలు చేసిన ప్పటికిని స్పందించని ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఒక్క రోజు నిరసన దీక్ష చేపట్టారని, వారి దీక్షకు మద్దతుగా అన్ని జిల్లా కేంద్రాలలో నిరసనలు జరుగుతున్నాయని, ప్రభుత్వం మొద్దు నిద్రవీడి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాసరావు, కోశాధికారి సుధాకర్, జిల్లా కార్యదర్శులు చిక్కుడు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, వివిధ మండలాల బాధ్యులు కనకయ్య, నాగరాజు నీలకంఠం, జంపయ్య, గోవర్ధన్ రెడ్డి, ఆగయ్య, ఉప్పలయ్య, మహేష్, రవీందర్, నర్సింహులు, ఉప్పలయ్య, సురేష్ బాబు, సయీద్, వనం నర్సింహులు, రవి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరి జలాలను లక్నవరం సరస్సుకు తరలించాలి : ఎమ్మెల్యే సీతక్క



నవతెలంగాణ-గోవిందరావుపేట

గోదావరి జనాలను లక్నవరం సరస్సుకు తరలించి జలాశయంగా ఉంచి రెండు పంటలకు నీరు అందించాలని ములుగు ఎమ్మెల్యే సీతక్క అన్నారు.శనివారం మండలంలోని లక్నవరం సరస్సును కాంగ్రెస్ జిల్లా నూతన అధ్యక్షులు పైడాకుల అశోక్‌తో కలిసి మండల ముఖ్య నాయకులతో సందర్శించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ లక్నవరం సరస్సు చాలా అందమైన సరస్సు అని, చుట్టూ కొండలతో నిండైన జలాశయంతో అత్యంత రమణీయంగా ఉంటుందని, అందుకే సందర్శకులను నిత్యం ఆకట్టుకుంటూ ఎప్పుడు సందడి, సందడిగా ఆకర్షణీయంగా ఉండే లక్నవరం సరస్సు ఈరోజున వెల, వెలబోతు పూర్తిగా ఎండిపోయి, జలాశయంలాగా లేక దారుణమైన స్థితిలో ఉందని, లక్నవరం సరస్సు కింద సుమారుగా 7000 ఎకరాల పైగా ఎకరాల్లో వరి పంటకు సాగు నీరు అందిస్తున్నది అని, అలాంటి సరస్సు ఇవ్వాళ వెల, వెల పోవడం విచారకరం అని అన్నారు గత కొన్నేండ్ల నుండి లక్నవరం సరస్సు జలాశయం నీరు లేక ఎండిపోయిన స్థితి లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సరస్సులకొరకు మిషన్ కాకతీయ లాంటి కార్యక్రమాన్ని తీసుకువచ్చిన లక్నవరం సరస్సుకు ఎటువంటి లాభం జరగలేదని అన్నారు. గోదావరి జలాలను సరస్సుకు అందించి నిరంతరం రిజర్వాయర్ లాగా మార్చి పర్యాటకులకు రైతులకు పంటలు పండించుకునే విధంగా మార్చాలని అన్నారు. 13వ శతాబ్దంలో కాకతీయులు నిర్మించిన ఈ లక్నవరం చెరువు లీకేజీలను కూడా అరికట్టలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. ఇప్పటికి అయిన ప్రభుత్వం మేల్కొని ఎన్నో వేల ఎకరాలకు సాగు నీటిని అందిస్తున్న పాకాల, రామప్ప, ఇంచిచెర్వుపల్లి, ఘనపురం, మల్లూరు, లక్నవరం సరస్సులకు గోదావరి జలాలను తరలించి రైతులను ఆదుకోవాలని, పర్యాటకుల కొరకు ఆకర్షణీయంగా తీర్చిదిద్ది ఆకట్టుకోవాలి అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఎల్‌డిఎం ఆర్గనైజింగ్ కార్యదర్శి డా.అనిల్ కుమార్, మహబాద్ పార్లమెంటు కో-ఆర్డినేటర్ మార్క విజయ్, టీపీసీసీ కార్యదర్శి చల్లా నారాయణ రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు గొల్లపెల్లి రాజేందర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బానోత్ రవిచందర్, జిల్లా ప్రచార కమిటీ చైర్మన్ పూజారి సురేందర్, ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు మామిడిశెట్టి కోటి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బైరెడ్డి భగవాన్ రెడ్డి, ఇరుసవడ్ల వెంకన్న, మండల అధ్యక్షులు ఎండి.చాంద్ పాషా, బొల్లు దేవేందర్, చిటమట రఘు, ఎండి. అఫ్సర్ పాషా, మైల జయరాం రెడ్డి, వజ్జ సారయ్య, జాడి వెంకటేశ్వర్లు, వర్కింగ్ ప్రెసిడెంట్లు, ఆకుతోట చంద్రమౌళి, నల్లెల్ల భరత్, బండి శ్రీనివాస్, రసపుత్ సీతారాంనాయక్, గాదరి కిషోర్, గౌరవ అధ్యక్షులు జాలవు అనంత రెడ్డి, సహకార సంఘ అధ్యక్షులు బొక్క సత్తిరెడ్డి, పన్నాల ఎల్లారెడ్డి, పులి సంపత్, ఎంపీపీ బానోత్ విజయ-రూప్ సింగ్, జడ్పీటీసీ ఈసం రమ-సురేష్, ఎంపీపీ సువర్ణపాక సరోజన-జగ్గారావు, వైస్ ఎంపీపీ కాడబోయిన జంపయ్య, ఉమ్మనేని రమేష్, చింతనిప్పుల భిక్షపతి, వంగ రవి, యూత్ మండల ఉపాధ్యక్షులు ఈసం అశోక్, ఎస్.కార్తీక్ తదితర నాయకులు పాల్గొన్నారు.

కేసీఆర్ కుటుంబంలో తెలంగాణ బంధీ : తాటి క్రిష్ణయ్య

నవతెలంగాణ-మంగపేట

నీళ్ల నిధులు నియామకాలు అంటూ అధికారంలోకి వచ్చిన కేసీఆర్ తెలంగాణ కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరులను అడ్డంపెట్టుకోని ప్రజలను వంచిస్తూ తెలంగాణ రాష్ట్రాన్ని తన కుటుంబంలో బంధీ చేశాడని ఆ కుటుంబం నుండి తెలంగాణాకు విముక్తి కల్పించాల్సిన తరుణం ఆసన్నమైందని బీజేపి రాష్ట్ర గిరిజన మోర్చా అధికార ప్రతినిధి తాటి క్రిష్ణయ్య ఆరోపించారు. శనివారం మండలంలోని తిమ్మంపేట గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు లోడే శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైన క్రిష్ణయ్య మాట్లాడుతూ ఎన్నో ఆశలతో సాధించుకున్నతెలంగాణ కేసీఆర్ కుటుంబంలోని నలుగురు చేతిలో బంధీ అయిపోయిందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలే లక్ష్యంగా ఏర్పడిన తెలంగాణ ప్రస్తుతం నీళ్లు లేక నిధులు లేక నియామకాలు చేపట్టక అల్లాడిపోతుందన్నారు. కెసిఆర్ ఫ్యామిలీలో మాత్రమే నిధులు, నియామకాలు జరుగుతున్నాయి తప్ప రాష్ట్రంలో ఏ పేదవాడికీ రాలేదని ఎద్దేవా చేశారు. బంగారు తెలంగాణ చేస్తానని సొల్లు కబర్లు చెప్పిన కేసీఆర్ నేడు రాష్ట్రాన్ని అప్పుల తెలంగాణగా మార్చి ప్రజలను మభ్యపెడుతున్నాడని ఆరోపించారు. వచ్చే సాధారణ ఎన్నికల్లో బిజెపి తెలంగాణలో అధికారంలోకి వస్తుందని ప్రజల ఆకాంక్షలు ఆశయాలు నెరవేరుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గాజుల కృష్ణ, అల్లె జనార్ధన్, పొదెం రవీందర్, ఎండి.యాకూబ్ పాషా, రామిడి సురేష్, పాకనాటి వెంకటరెడ్డి, గూడబోయిన సురేష్, మర్రెడ్డి సుధాకర్ రెడ్డి, లొంక రాజు, గద్దల రఘు, జాడి రాంబాబు, ఆవుల సతీష్, బొల్లికొండ సాంబయ్య, సాధనపెల్లి సమ్మయ్య, బోనగిరి యాదగిరి, గాదె శ్రీనివాస చారి, కల్తి రామకృష్ణ, గోమాసు సావిత్రి, కొత్తపల్లి కుమారస్వామి, జాడి నరసింహారావు, లోడిగా మధుకర్, కొట్నాల కుమార్, బోడ సురేష్, మూతి రవి, బుర సుధాకర్, పొద తేజస్వి, మద్దెల పుల్లయ్య, దంతనపల్లి సత్యనారాయణ విశ్వనాథంలు పాల్గొన్నారు

రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చాలి : అదనపు కలెక్టర్

నవతెలంగాణ-ములుగు

రాష్ట్రస్థాయిలో మంచి ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవిన్యూ వైవి గణేష్ క్రీడాకారులనుదేశించి అన్నారు. శనివారం ములుగు జిల్లా కేంద్రం నుండి జిల్లా అదనపు కలెక్టర్ రెవిన్యూ వైవి గణేష్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ పోరిక గోవింద నాయక్, డిపిఒ వెంకయ్యలతో కలిసి ఇటీవల జిల్లా స్థాయిలో నిర్వహించిన సీఎం కప్ ఆటల పోటీలో రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులను హైదరాబాదుకు జిల్లా అదనపు కలెక్టర్ రెవిన్యూ వైవి గణేష్ జెండా ఊపి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసి పంపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల సర్వీస్ అధికారి పి.వెంకటరమణ చారి క్రీడాకారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మేడారం జాతర కోసం భూ సేకరణ : డీఆర్‌వో

నవతెలంగాణ-ములుగు

ములుగు జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలోకలెక్టర్ ఆదేశాల మేరకు డిఆర్ఓ కుతాటి రమాదేవి ఆధ్వర్యంలో శనివారం రైతులతో మాట్లాడి వారికి పూర్తి నష్టపరిహారం మంచి రేటుతో ఇప్పిస్తామని, ప్రతి రైతు నష్టపోకుండా ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా ఇస్తానని హామీ ఇచ్చారు. జెడ్పీ వైస్ చైర్మన్ బడే నాగజ్యోతి, తహసిల్దార్ ముల్కనూర్ శ్రీనివాస్, మేడారం దేవాదాయ శాఖ భూములు కోసం మేడారం పూజారులతో కలిసి భూ సేకరణ కోసం సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేడారం సర్పంచ్ చీడం బాబురావు, ప్రధాన పూజారి సిద్ధబోయిన జగ్గారావు, దేవాలయ ప్రధాన కార్యదర్శి రాజేందర్ పాల్గొన్నారు.

యువతను క్రీడల్లో ప్రోత్సహించాలి : వివేక్



నవతెలంగాణ-నెల్లికుదురు

యువతను క్రీడల్లో ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని యువ నాయకుడు వంగాల వివేక్ అన్నారు. మండలంలోని ఎర్రబెల్లిగూడెం గ్రామంలో యువసేన యూత్ పిల్లలకు 4000 విలువచేసే క్రికెట్ కిట్టును శనివారం అందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామంలో నేను సిద్ధి వినాయక పేరుతో టెంట్ హౌస్‌ను ప్రారంభించి ఆర్థికంగా ఎదగాల ఉద్దేశంతో ముందుకు వెళుతున్నాను అన్నారు. గ్రామస్తులు ప్రజలకు సేవ చేసే అదృష్టంగా భావించి గ్రామ అభివృద్ధి కోసం కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు బంగాళా సోమయ్య, కనికర సందీప్, జిలకర శ్రీధర్, చెడబాక నరేష్, సాయి, తేజ, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు అధైర్య పడవద్దు : పీఏసీఎస్ చైర్మన్



నవతెలంగాణ-నెల్లికుదురు

రైతులు అధర్య పడవద్దు అని నెల్లికుదురు పిఎసిఎస్ చైర్మన్ లక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. రైతులు తీసుకువచ్చిన వరి ధాన్యాన్ని నెల్లికుదురు పిఎసిఎస్ రామన్నగూడెం గోదాంలో వడ్ల లోడు బస్తాల దిగుమతి చేయించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్ర నిర్వాహకులు పంపించినటువంటి ధాన్యాన్ని ఇక్కడ ఎక్కువ సమయం తీసుకోకుండా రాగానే లోడులను దిగుమతి చేయించే కార్యక్రమాన్ని తీసుకుంటున్నానే అన్నారు. వర్షాలు పడి రైతులు ఇబ్బంది పడే పరిస్థితి నెలకొంటదనే ఉద్దేశ్యంతో తొందరగా దిగుమతి చేయించే కార్యక్రమాన్ని తీసుకుంటున్నామని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు ఎంత తొందరగా పంపిస్తే అంత తొందరగా ఇక్కడ దిగుమతి చేయించుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జెల్ల వెంకటేష్, పులి శ్రీను, రైతులు పాల్గొన్నారు.

తెలంగాణ దశాబ్ది ఉత్సవాలకు నెలవారీ ప్రణాళిక : ఎస్పీ

నవతెలంగాణ-ములుగు

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్ద కాలం అవుతున్నందున ఆ ఉత్సవాలలో భాగంగా జూన్ 2 నుండి 22 వరకు జరిగే కార్యక్రమాలకు జిల్లా ఎస్పీ గౌస్ ఆలం ప్రణాళికను రూపొందించారు. శనివారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో అధికారులు సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా బ్లూ కోల్ట్ 100 డయల్ వంటి అత్యవసర సేవలపై ప్రజలకు అవగాహన కలిగించేలా పోలీస్ డిపార్ట్మెంట్ ర్యాలీలు, ఉచిత రక్తదాన శిబిరం, మెడికల్ క్యాంప్, ట్రైబల్ యువతకు స్పోర్ట్స్ మీట్, రోడ్ సేఫ్టీ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్‌లో ఓపెన్ హౌస్, ప్రకృతి విపత్తు వరదలు సంభవించినప్పుడు పోలీస్ సిబ్బంది ప్రాణాలకు తెగించి ప్రజలను ఎలా కాపాడారో ప్రజలకు తెలియజేయుట, మహిళల భద్రతకై షీ టీం యొక్క విధివిధానాలను సేవలను ఎలా ఉపయోగించుకోవాలో బాలికలకు, మహిళలకు తెలియజేయుట వంటి అనేక కార్యక్రమాలకు జిల్లా ఎస్పీ శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డి అశోక్ కుమార్, అదనపు ఎస్పీ సదానందం, డీఎస్పీ డిసిఆర్బి సుభాష్ బాబు, డీఎస్పీ నలువాల రవీందర్, సిఐ స్పెషల్ బ్రాంచ్ శ్రీనివాస్, ఆర్ఐ అడ్మిన్ వెంకటనారాయణ, ములుగు సీఐ రంజిత్ కుమార్,సిఐ సిసిఎస్ రవీందర్, ఆర్ఐ ఆపరేషన్ కిరణ్, ములుగు ఎస్సై పవన్‌లు పాల్గొన్నారు.

ఘనంగా గండు బుచ్చయ్య వర్ధంతి



నవతెలంగాణ-నెల్లికుదురు

బహుజన వీరుడు, ముద్దుబిడ్డ గండు బుచ్చయ్య మూడవ వర్ధంతిని ఘనంగా నిర్వహించినట్లు గండు బుచ్చయ్యచారి ట్రస్ట్ చైర్మన్ దేశగాని బలరాంగౌడ్ తెలిపారు. మండలంలోని మేషరాజుపల్లి గ్రామంలో ఆయన విగ్రహానికి పూలమాలవేసి శనివారం రోజు ఆయన కూతురు మేడి మంగతో కలిసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజన వీరుడైన గండు బుచ్చయ్య ఆరోజు స్వాతంత్ర ఉద్యమంలో పోరాడి గ్రామ అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేశాడని అన్నారు. ఆరోజుల్లో ఈ మేచరాజుపల్లి గ్రామానికి రోడ్లు, విద్యుత్తు లైట్లు, మౌలిక వసతులు ఏమి లేనటువంటి క్రమంలో అతను ఒక ఉద్యమంగా అన్ని కులాలను అన్ని వర్గాలను ఐకమత్యం చేసి భూస్వాముల పెత్తందారులకు వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తిని అన్నారు. ఆయన పేద ప్రజల బాగోవుల కోసం అనేక కృషి చేశారని కొనియాడారు. అలాంటి గొప్ప వ్యక్తి ఈ రోజు మూడో వర్ధంతి చేయడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన కూతురు గండు మంగ, వార్డు మెంబర్స్ గొడుగు వెంకన్న, ఎల్తూరు ఉప్పలయ్య, కులసంఘాల అధ్యక్షులు కోటగిరి, పెద్ద గుంశాల గౌడ్, పెద్ద బోయిన రాజాలు, ఎల్తూరి సోమయ్య, వెంకట సాయిలు, ముంజపల్లి చంద్రయ్య, వ్యాసర సురేష్, కళాధర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల ధాన్యాన్ని మిల్లులకు వెంటనే తరలించాలి

తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సామ చంద్రారెడ్డి



నవతెలంగాణ-గోవిందరావుపేట

ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు వేసిన రైతుల ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సామ చంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని చల్వాయి గోవిందరావుపేట సోమలగడ్డ, గౌరారం కొనుగోలు కేంద్రాలను తెలంగాణ రైతు సంఘం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ ధాన్యం కాటా అయిన తరవాత కొనుగోలు కేంద్రం నుండి వారం రోజులుఅయినా మిల్లులకు తరలించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అసలు విషయం లారీల కొరతతో లారీలు రాక కాంటా అయిన ధాన్యం కుప్పలు తెప్పలుగా నిల్వగా ఉన్నాయని, తూకం అయిన ధాన్యం నిల్వగా ఉండటం వల్ల తూకం తగ్గి నష్టపోతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. సాధారణంగానే తూకంలో కోతలు విధిస్తున్న మిల్లర్లు అసలు తూకంలో తక్కువగా ఉంటే అందిన కాడికి దోచుకుంటూ రైతులను మోసం చస్తున్నారని అన్నారు. దీంతోపాటు వాతావరణం మార్పుతో అకాల వర్షాలు రైతులను ఎంతో నష్టపరిచాయని, ఇప్పుడు తూకం వేసిన ధాన్యం తడిస్తే రెండింతలు ఖర్చు వస్తుందని ఆరుగాలం చేసిన కష్టం తడిసి ముద్దయి నష్టపోతున్నామనని ఆందోళన చెందుతున్నారు. ఇటువంటి పరిణామం రాకుండా చూడాలని తెలంగాణ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. అధికారులు వెంటనే స్పందించాలని, రైతులకు సహకరించాలని తెలంగాణ రైతు సంఘం రైతుల తరపున డిమాండ్ చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్షులు గుండు రామస్వామి, సొసైటీ డైరెక్టర్ సదానందచారి, రైతులు నరిగె రాములు, చినుబోయిన మహేందర్, వీరం తులసీ, వీరం కుమారి, ఓదెలు, గంజి ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ భవనాన్ని రాష్ట్రపతిచే ప్రారంభించాలి

ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో నిరసన



నవతెలంగాణ-నెల్లికుదురు

నూతన పార్లమెంటు భవనాన్ని భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్మ చేతుల మీదుగా ప్రారంభించాలని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కోఆర్డినేటర్ పెరుమాండ్ల గుట్టయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద శనివారం ఎస్టీ సెల్ నాయకులు గూగులోతు వెంకన్న, గుగులోతు యాకూబ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రపతికి ఆహ్వానం ఇప్పటికీ పలక పోవడం బిజెపి ప్రభుత్వం కించపరిచినట్టేనని అన్నారు. భారత రాష్ట్రపతిని మోడీ ప్రభుత్వం లెక్క చేయకపోవడం విచారకమరణమని అన్నారు. ఈ బీజేపీ ప్రభుత్వం ఆదివాసి ఎస్టి దళితులను మహిళలను లెక్కచేయకుండా అవమానపరిచి హేళన చేయడం బిజెపి ప్రభుత్వానికి సిగ్గుచేటు అని అన్నారు. ఒక రాష్ట్రపతికి ఆహ్వానం లేక పోవడం ఏంటని వారు ప్రశ్నించారు. రాష్ట్రపతి ద్రౌపది మూర్ము పార్లమెంటు ప్రారంభించక పోతే ఊరుకునేది లేదని అన్నారు. ఆవాస్కార్ జన్మదినం ఈనెల 28వ తేదీన ఉందని అదే రోజు పార్లమెంటు ప్రారంభించాలని మోడీ నిర్ణయించడం విచారకరమని అన్నారు. ఆవాస్కర్ అనే వ్యక్తి మన ఉద్యమకారులకు వ్యతిరేకుడని ఆంగ్ల మనిషిని అన్నారు. ఆనాడు ఉద్యమకారులను ఎదిరించాడని బ్రిటిష్ వారికి వత్తాసు పలికాడని, అలాంటి వ్యక్తి పుట్టినరోజు సందర్భంగా ఇంత పెద్ద పార్లమెంటును ప్రారంభించడం దానికి భారత రాష్ట్రపతికి ఆహ్వానం లేక పోవడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధికార ప్రతినిధి కుమ్మరికుంట్ల మౌనేందర్, రాజు నాయక్, ఇస్లావత్ బాలాజీ, నరసింహులు, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

అశోక్‌కు శుభాకాంక్షలు తెలిపిన సర్పంచ్



నవతెలంగాణ-గోవిందరావుపేట

కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా నూతన అధ్యక్షునిగా పైడాకుల అశోక్ ఎన్నికై శనివారం తొలిసారిగా మండలానికి రాగా సోమలగడ్డ సర్పంచ్ మంగ ఎలేంద్ర నరసింహ పూల బోకేతో శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎలేంద్ర నరసింహ మాట్లాడుతూ మండలంలోని చల్వాయి గ్రామానికి చెందిన పైడాకుల అశోక్ ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షునిగా ఎంపిక కావడం యావత్ మండల ప్రజానీకం హర్షించదగ్గ విషయమన్నారు. అశోక్ తండ్రిగారైన కృష్ణమూర్తి లాగే ఎన్నో విజయాలను కాంగ్రెస్ పార్టీకి అశోక్ అందించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మరి ఎన్నోకీలక పదవులను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. అశోక్ మాట్లాడుతూ మీ అందరి సహకారం వల్లే జిల్లా అధ్యక్ష పదవి లభించిందని అందరికీ రుణపడి ఉంటానని అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నాని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

యూనిఫాంలను పంపిణీ చేయాలి : డీడీ



నవతెలంగాణ-ఏటూర్‌నాగారం ఐటీడీఏ

ఐటీడీఏ పరిధిలోని 2023-24 విద్యా సంవత్సరంలో గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో చదువుతున్న బాల బాలికలకు యూనిఫాంలను పాఠశాల ప్రారంభంలోనే ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలని ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ పోచం అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తన కార్యాలయంలో హెచ్ఎంలు, హెచ్‌డబ్ల్యాలతో ఆయన సమావేశం అయ్యారు. అనంతరం పోచం మాట్లాడుతూ బాలబాలికలకు యూనిఫామ్స్ కుట్టించేందుకు పక్కాప్లాన్ చేయాలన్నారు. ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసి ములుగు, భూపాలపల్లి జిల్లాల దర్జి సెంటర్ (టైలరింగ్) ఇంచార్జితో మాట్లాడి యూనిఫాంలు కుట్టేవిధంగా చూడాలన్నారు. 2023-24 విద్యా సంస్థలలోని విద్యార్థులకు పాఠశాలలు ప్రారంభించకముందే ఇచ్చేలా దర్జీలతో మాట్లాడి క్లాత్‌ను మండలాల వారీగా ఇచ్చి కుట్టించాలన్నారు. రెండు జిల్లాలలో ఉన్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఆయా ఇన్‌చార్జ్‌లు బాధ్యత తీసుకొని దినిపై పర్యవేక్షణ చేస్తూ జాప్యం లేకుండా చూడాలన్నారు. సమావేశంలో సెంటర్ ఇన్‌చార్జ్ పీజీహెచ్ కె.శ్రీనివాస్, పీజీహెచ్ఎం నాగేశ్వర్‌రావు, హెచ్‌డబ్ల్యూఓ మనోజ్‌కుమార్, హెచ్ఎంలు సరోజన, సమ్మయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా-ఇద్దరికీ తీవ్ర గాయాలు

నవతెలంగాణ-కొత్తగూడ

మండల కేంద్రం నుండి గంగారం మండలం భావురుగొండకు వెళ్తున్న ట్రాక్టర్ వేలుబెల్లి క్రాస్ రోడ్డు వద్దకు వెళ్లగానే అదుపుతప్పి బోల్తా కొట్టింది. దీంతో ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న వజ్జ నాగమ్మకు కాలు విరగగా ధనసరి సారక్కకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

నవతెలంగాణ
వరంగల్, హనుమకొండ
ఆదివారం 21 మే 2023

సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతాం

నవతెలంగాణ-పర్వతగిరి

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అమ్మకాలు సక్రమంగా జరిగేందుకు సంబంధిత ఉన్నత అధికారుల దృష్టికి తీసుకు వెళతామని తహశీల్దార్ కోమిఅజ్మీరా, ఎస్సై డి.దేవేందర్‌లు పేర్కొన్నారు. మండలంలోని గోపనపల్లి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి వారి సమస్యలను తెలుసుకుని నేరుగా మాట్లాడారు.రైస్ మిల్లర్ల అవినీతి చర్యలు అరికట్టడానికి సకాలంలో లారీలు వచ్చి దాన్యము తరలించుట, పండించిన పంటలో కోత లేకుండా అవకతవకలు లేకుండా పై స్థాయి అధికారుల దష్టికి తీసుకెళ్లి రైతుల సమస్యలు పరిష్కరించేలా కషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పంజా మహేష్, ఎంపీటీసీ సూర రమేష్, వార్డు మెంబర్ అన్నయ్య, సెంటర్ ఇంచార్జీ వెంకటయ్య,పంచాయతీ కార్యదర్శి సదానందం, కారోబార్ రాజు, రైతులు బెల్లం కుమార్, బోయిని ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభించిన ఎమ్మెల్యే ధర్మారెడ్డి

నవతెలంగాణ-పరకాల



పరకాల పట్టణంలోని హుజురాబాద్ రోడ్ వద్ద శనివారం శ్రీ భక్తాంజనేయ ఫిల్లింగ్ స్టేషన్ ను ప్రారంభించిన శాసనసభ సభ్యులు చల్లా ధర్మారెడ్డి. ఈ ఫిల్లింగ్ స్టేషన్ కాటూరి జగన్నాథ చారి,సూర్యదేవర శ్రావణ్, శ్రీనివాస్ ,కొడితల రాజేంద్ర కుమార్, ఆవాల జార్జ్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరు బిక్షపతి పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి పరకాల పుర ప్రముఖులు, రాజకీయ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

నవతెలంగాణ-హన్మకొండ

నిత్యజీవితంలో భాగమైన యోగ ప్రస్తుతం విశ్వవిజేతగా నిలుచుందని ప్రముఖ యోగా గురువు పోషాల శ్రీనివాస్ అన్నారు.శనివారం చారిత్రాత్మకమైన పద్మాక్షి అమ్మవారి దేవాలయంలో ఘనంగా యోగా వేడుకలను హరిత యోగ సాధకుల నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం 25 రోజుల కౌంట్ డౌన్ కార్యక్రమాన్ని ఈరోజు నుంచి ప్రారంభిస్తున్న క్రమంలో నగరంలోని పద్మాక్షి దేవాలయంలో హరిత యోగ సాధకులతో ప్రాణాయామము, ధ్యానము, ఆసనాలను చేయించడం జరిగిందన్నారు.

వికలాంగులకు పండ్లు పంపిణీ

నవతెలంగాణ-కాజీపేట

హనుమకొండకు చెందిన కేవులోతు మహేందర్ సునీత దంపతుల కూతురు యోగిత రెండవ పుట్టినరోజు సందర్భంగా శనివారం మల్లికాంబ మనోవికాస కేంద్రం గల వికలాంగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తమ కూతురు పుట్టిన రోజు వేడుకలు మానసిక వికలాంగుల మధ్య జరుపుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖన పోటీలలో విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-కాశిబుగ్గ



శాగంటి ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖన పోటీలలో కాశిబుగ్గలోని శ్రీ సాయి విజ్ఞాన భారతి హైస్కూల్ విద్యార్థులు పాల్గొని అత్యంత ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్‌సామల శశిధర్ రెడ్డి తెలిపారు. అకాడమీ ఆధ్వర్యంలో శనివారం హనుమకొండ లోని సత్యం పబ్లిక్ స్కూల్ లో స్వచ్ఛ భరత్ పై నిర్వహించిన చిత్రలేఖన పోటీలలో పాల్గొన్న విద్యార్థులు వర్ధన్ క్రియేటివ్ కిడ్ ఆర్టిస్ట్ అవార్డ్, ఎం.శ్రీజ వుడెన్ పెన్సిల్ అవార్డును గెలుపొందినట్లు శశిధర్ రెడ్డి తెలిపారు. గెలుపొందిన విద్యార్థులు శాగంటి ఆర్ట్ అకాడమీ డైరెక్టర్ మంజుల, చీఫ్ అడ్వైజర్ నిమ్మల శ్రీనివాస్ ల చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందుకున్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు

నవతెలంగాణ-చెన్నారావుపేట



మండల కేంద్రానికి చెందిన పైసా సదానందం విద్యుత్ షాక్ తో శుక్రవారం మతి చెందారు. మతునికి ఇద్దరు కుమార్తెలు పెద్ద కుమార్తె నందిని తండ్రికి తలకొరివి పెట్టడంతో గ్రామస్తులు బంధువులు రోధిస్తూ కన్నీరుమున్నీరయ్యారు. కుటుంబ సభ్యులు దుఖ? సంద్రంలో మునిగారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బర్ల దేవదాస్ ,కొంకటి రమేష్,కొంకటి రవి, సొసైటీ డైరెక్టర్ జంగిలి రాజు, గ్రామ ఎస్ సి సెల్ అధ్యక్షుడు నర్మెట సాంబయ్య, సాదు నర్సింగ రావు,పైసా సారంగం, పసునూరి స్వామేల్, ఆకులపెల్లి రమేష్ , నర్మెట యాదగిరి, జంగిలి సంపత్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో మృతిచెందిన పైసా సదానందం నిరుపేద కుటుంబాలు అని ఎస్ఐ తోట మహేందర్‌కు గ్రామస్తులు వివరించడంతో మానవత్వం తో వెంటనే స్పందించి సమాధి తీయుటకు జేసీబీ పంపించి సహాయ సహకారాలు అందించి మరోసారి మానవత్వం చాటుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ జెడ్పీటీసీ దుర్మరణం

నవతెలంగాణ-సంగెం



గీసుగొండ మండలం గంగదేవిపల్లి స్టేజి దగ్గర నర్సంపేట రహదారిపై అతిఘోరంగా జరిగిన రోడ్డు ప్రమాదంలో కేసముద్రం మండలం మాజీ జడ్పిటిసి వేం పురుషోత్తం రెడ్డి శనివారం దుర్మరణం పాలయ్యారు. వివరాల్లోకి వెళితే కేసముద్రం మాజీ జెడ్పిటిసి వేం పురుషోత్తం రెడ్డి తన వాహనంలో నర్సంపేట నుండి వరంగల్ వైపు వెళుతుండగా ఎదురుగా ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో వాహనంలో ఉన్న పురుషోత్తం రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు.ఇతను మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్ రెడ్డి సోదరుడు.కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకన్న తెలిపారు.

మాజీ ఎంపీపీ సారంగపాణికి మాతృవియోగం

నవతెలంగాణ-నల్లబెల్లి

అనారోగ్యంతో మాజీ ఎంపీపీ బానోతు సారంగపాణి తల్లి బానోత్ గూమ్లీ శనివారం ఉదయం మతి చెందగా వారి భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాల వేసి మృతిపట్ల ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసి కుటుంబ సభ్యులను పరామర్శించి అంతిమయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి,జడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్దిస్వప్న. ఎమ్మెల్యే వెంట మండల నాయకులు ఊడుగుల ప్రవీణ్, గందె శ్రీనివాస్‌గుప్తా, మోహన్ రెడ్డి, మాలోతు ప్రతాప్‌సింగ్, రాజారాం, స్థానిక సర్పంచ్ వక్కల మల్లక్క, ఎంపీటీసీ ఓదెల విజయలక్ష్మి రవి, కారుకూరి శ్రీనివాస్, ఇతర గ్రామాల సర్పంచులు, పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బ్యాండ్ వాయిద్య కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

నవతెలంగాణ-పర్వతగిరి



బ్యాండ్ వాయిద్య కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని బ్యాండ్ వాయిద్య కళా కారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దికుంట యాదగిరి కోరారు. మండల కేంద్రంలో శనివారం మండల అధ్యక్షుడు మహమ్మద్ నజీరోద్దిన్ అధ్యక్షతన సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడారు. మన రాష్ట్రం లో సుమారు 7 లక్షల మంది బ్యాండ్ వాయిద్య వత్తిని ఆధారంగా చేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి లో కొట్టుమిట్టాడుతున్న బతుకులు మావని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆర్థికంగా వెనుకబడిన మమ్మల్ని ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా కమిటీ సభ్యులు చాంద్ పాషా, వెంకన్న, నంగునూరి శంకర్,కొమురయ్య,మండల గౌరవ అధ్యక్షుడు సారయ్య, కట్టయ్య, మొగులానా,వీరాస్వామి,బాషా,వెంకన్న,బాబు, యాకయ్య,మైభు పాషా, సంపత్, ఆశిన్,దేవేందర్,రషీద్, బ్రహ్మన్న, ఇస్మాయిల్, రజనీకర్,మైను,బాబుపాల్గొన్నారు.

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

రాష్ట్ర రెడ్డి సంఘం అధ్యక్షుడు గోపు జయపాల్ రెడ్డి

నవతెలంగాణ-ఆత్మకూర్



ప్రభుత్వం 2018 లో ఇచ్చిన హామీ మేరకు వెంటనే రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జయపాల్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆత్మకూరు మండల కేంద్రంలో రెడ్డి సంఘం మండల అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో జూన్ 1న జరిగే రెడ్ల ఆత్మీయ సమ్మేళనం వాల్ పోస్టర్ను విడుదల చేశారు. అనంతరం జయపాల్ రెడ్డి మాట్లాడుతూ రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసి పేద ప్రజలకు న్యాయం చేయాలన్నారు. రెడ్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే ప్రభుత్వానికి గుణపాఠం తప్పదంటూ హెచ్చరించారు. జూన్ 1న జరిగే రెడ్ల సమావేశానికి భారీఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ రేవూరి జయపాల్ రెడ్డి, దేవేందర్,రెడ్డి ప్రవీణ్ రెడ్డి,రేవూరి సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని కిసాన్ కాంగ్రెస్ ధర్నా





నవతెలంగాణ-పర్వతగిరి

ధాన్యం కొనుగోలు చేపట్టాలని పర్వతగిరి మండలంలోని జమాల్ పురం గ్రామ కొనుగోలు కేంద్రం వద్ద కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా అధ్యక్షుడు బొంపల్లి దేవేందర్‌రావు రైతులు, నాయకులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ధాన్యం తగలబెట్టి నిరసన చేశారు. అనంతరం దేవేందర్‌రావు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే రమేష్ ఇదే మండలానికి చెందిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావులు కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు కాక రైతులు ఇబ్బంది పడుతున్న పట్టించుకోవడంలేదని ఆరోపించారు. కొనుగోలు కేంద్రాల్లో వడ్లు పోసి రెండున్నర నెలలు గడుస్తున్న నేటికీ కాంటాలు కావడం లేదని, కాంటాలు పెట్టిన ధాన్యాన్ని సైతం తరలించడానికి లారీలు అందుబాటులో లేవని మండిపడ్డారు. మిల్లర్లు తరుగు, తాలు పేరుతో క్వింటాకు 7 కిలోల వరకు తగ్గిస్తున్నారని ధ్వజమెత్తారు. వెంటనే మండలంలోని ఆయా గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో దాన్యాన్ని కొనుగోలు చేసే తరలించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈధర్నాతో ఇరు పక్కల వాహనాలు స్తంభించిపోయాయి.

ధర్నా విషయం తెలుసుకున్న తహసిల్దార్ కోమి అజ్మీరా ఎస్సై డి.దేవేందర్ సిబ్బందితో అక్కడికి చేరుకొని నాయకులతో మాట్లాడారు. ధాన్యం కొనుగోలు చేపట్టి వెనువెంటనే తరలిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం చౌటపల్లి లోని కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు పర్వతగిరి సీఐ శ్రీనివాస్‌తో ఫోన్లో మాట్లాడి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జమాల్ పురం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జున్ను కనకయ్య, దేవేందర్ రావు, శంకర్, నిమ్మల దేవేందర్, బండి సదయ్య, బైరబోయిన సదయ్య, గోదారి యాకయ్య, పార్టీ ఉప అధ్యక్షుడు జిల్లా హరీష్, గోదారి రాజు, రజినీకాంత్,జమాల్ పురం గ్రామ రైతుల పాల్గొన్నారు.

నల్లబెల్లి : తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే రైతులకు మంచి రోజులు వస్తాయని ఆశిస్తే తెలంగాణ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి అన్నారు. ఆరుకాలం రైతులు కష్టపడి పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర లేకపోవడం, రైతులు పండించిన పంటను అమ్ముకోవడానికి నాన్న తంటాలు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికే రైతులు వరి కోతలు కోసి నెలలు గడుస్తున్న పూర్తిస్థాయిలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదని, ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో దిగుమతులు కాక రైతులను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అటు వడ్లకు గిట్టుబాటు ధర కాక, ఇటు అకాలవర్షాలతో నష్టపోయిన పంటలకు పరిహారంరాక రైతులు నానాఅవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. కొందరు కొనుగోలుదారులు రైతుల నుండి మిల్లర్లకు పెట్టే తరుగు కొరకు ఒప్పంద పత్రాలపై రైతులతో సంతకాలు చేయించుకొని మిల్లర్లకు అండగా నిలుస్తూ రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని అన్నారు. రైతులు పండించిన పంటను ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా పూర్వంలాగా 41 కేజీ బస్తాలు తూకంగా నిర్ణయించి రైతులను ఇబ్బంది పాలు చేయకుండా కాపాడాలని, కాంటాలు అయినా ధాన్యాన్ని వెంటనే దిగుమతి అయ్యే విధంగా ఏర్పాట్లు చేసి రైతులను ఆదుకోవాలని వరి ధాన్యం మొక్కలు సకాలంలో ఎలాంటి కట్టింగులు లేకుండా కాంటాలు పెట్టాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో ప్రజా ప్రతినిధులు రాజీనామా చేయాలని లేనిచో ఆందోళన కార్యక్రమాలు విస్తతం చేస్తామని అన్నారు.

ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చార్ల శివారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఇస్తారు శేఖర్, మండల ఉపాధ్యక్షుడు పి కొమరారెడ్డి, కిసాన్‌సెల్ మండల పార్టీ అధ్యక్షుడు ఏడాకుల సంపత్ రెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు చెల్పూరు జ్యోతి, యువజనకాంగ్రెస్ అధ్యక్షుడు పురుషోత్తం సురేష్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు భూక్య బొసింగ్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు కుటుంబ రఘుపతి, గుండ్లపాడు సర్పంచ్ కదూరి కట్టయ్య, వడ్లూరి రమేష్, రఘుపతి, రామ్మూర్తి కొమరారెడ్డి, గోవింద్, రంజిత్, ఉపేందర్ రెడ్డి, శంకరయ్య, మోహన్, రాజు, రవి, గోవర్ధన్, ఇతర మండల నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యే దాస్యం వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా

నవతెలంగాణ- హనుమకొండ



కేంద్ర ప్రభుత్వంపై బిఆర్ఎస్ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నానని బిజెపి హన్మకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. శనివారం హనుమకొండ హంటర్ రోడ్ లోని బిజెపి కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇక్కడ వేలాది కార్మికుల కోసం దాదాపు రూ.550 కోట్ల రూపాయిల నిధులను కేటాయించి రైల్వే వోపీహెచ్ ఫ్యాక్టరీ నిర్మిస్తుంటే దానికి కావాల్సిన స్థలం ఇవ్వకుండా జాప్యం చేస్తుంది మీరు కాదా అని ప్రశ్నించారు. కార్పొరేటర్ స్థాయి నుండి ఈరోజు ప్రభుత్వం విప్ అయన వినయ్ భాస్కర్ హనుమకొండ హంటర్ రోడ్ లోని ఆర్టీసీ రిట్రేడింగ్ ఫ్యాక్టరీని ఇక్కడి కార్మికుల పొట్ట కొట్టి కరీంనగర్ తరలించి ఆ భూమిని మీ పార్టీ నాయకుడికి కట్టబెట్టడంలో మీ పాత్ర లేదా ఇది వాస్తవం కాదా అని అన్నారు. తెలంగాణ ఉద్యమం సమయం నుండి ఆటో కార్మికులను ఏకాం చేసిన గుడిమళ్ల రవి కుమార్ ని మీ స్వలాభం కోసం వంచించి ఈరోజు ఆటో యూనియన్ కార్మికులను రెండు వర్గాలుగా చీల్చింది మీరు కాదా అని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ఆర్టీసీ కార్మికులను నిర్లక్షణీయంగా మీ ప్రభుత్వం రోడ్ పై నెట్టేస్తే వారికీ అండగా నిలిచి వారి పక్షాన పోరాడింది బిజెపి పార్టీ అని గుర్తు చేశారు.

ఫర్టిలైజర్ షాపులను ఆకస్మిక తనిఖీ చేసిన పోలీసులు

నవతెలంగాణ-నడికూడ



మండలంలో వివిధ సీడ్స్ , ఫెర్టిలైజర్స్ షాపులను వ్యవసాయ శాఖ అధికారులు, పరకాల ఏసీపీ శివరామయ్య ఆధ్వర్యంలో పోలీసులు కలిసి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆయా షాపులలో ఉన్నటువంటి స్టాక్ వివరాలు, రికార్డులను పరిశీలించి నకిలీ విత్తనాల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎసిపి శివరామయ్య మాట్లాడుతూ ఫర్టిలైజర్ షాపు యజమానులు నకిలీ విత్తనాలు అమ్మకూడదని, ఒకవేళ షాపుల యందు గాని మరి ఏ ఇతర ప్రదేశంలోగానీ నకిలీ విత్తనములు పట్టుబడిన యెడల చట్టరీత్యా చర్య తీసుకోబడునని హెచ్చరించారు. నకిలీ విత్తనాలు అమ్మిన వ్యక్తులపై పీడీ యాక్ట్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. రైతులు ప్రభుత్వం ఆమోదం పొందిన షాపుల్లోనే విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోలు సమయలో రశీదు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే వ్యాపారుల లైసెన్సులు సీజ్ చేస్తామని పేర్కొన్నారు. ఈ తనిఖీలో పరకాల సీఐ కిషన్, ఎస్సై ప్రశాంత్ బాబు తదితరులు పాల్గొన్నారు.

జీపీ సిబ్బందికి కనీస వేతనాలు అమలు చేయాలి



నవతెలంగాణ-నెక్కొండ

తెలంగాణ గ్రామపంచా యతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(సిఐటి యు) అనుబంధంగా జేపీసీ పిలుపు మేరకు నెక్కొండ మం డలంలోని మేజర్ గ్రామపంచా యతీ సర్పంచ్ యమున రంజి త్ రెడ్డి పంచాయతీ కార్యదర్శి సదానందం పంచాయతీ సిబ్బంది సమస్యలు పరి ష్కరించాలని కోరుతూ ప్రభుత్వానికి విన్నవించాలని వినతి పత్రం సమర్పిం చారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షుడు భూక్య నరేష్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు అమలు చేయక తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. సమస్యలు పరిష్కరించలేని ఎడల రాష్ట్రవ్యాప్తంగా జేపీసీ ఆధ్వర్యంలో పోరాటాలకు పిలుపునిచ్చామని జూ న్ నెల 5న పంచాయతీరాజ్ కమిషనర్‌కు సమ్మె నోటీసు ఇస్తామని జూన్ 25 నుండి సమ్మెకు వెళ్తామని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చొరవ జూపి సమస్యల పరిష్క రించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఈదునూరి సాయిలు మదర్ యాకయ్య సంతోష్ హేమ స్వరూప రాజు కొమురయ్య నరసమ్మ లచ్చమ్మ ఆదిరెడ్డి యాకయ్య స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 30న జాబ్ మేళా

నవతెలంగాణ-సుబేదారి

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగ యువతి యువకులకు ఈ నెల 30 న వరంగల్ ములుగు రోడ్ ,ప్రభుత్వ ఐ.టి.ఐ క్యాంపస్ లో జిల్లా ఉపాధి కల్పన కార్యలయంలో జాబ్‌మేళా నిర్వహించ నున్నట్లు హనుమకొండ జిల్లా ఉపాధి కల్పన అదికారి యం.మల్లయ్య తెలిపారు. గ్లిట్జ్ కార్పొరేషన్ హైదరాబాద్ కంపెనీలో గ్రాడ్యుయేట్ ఇంజినీర్ ట్రైనీ 50 ఉద్యోగాలకు విద్యా అర్హతలు (బీ టెక్. మెకానిక్, ఎలక్ట్రికల్,ఈ సి ఈ) రూ.19వేల పైనా వేతనం పొందవచ్చు. డిప్లొమా ఇంజినీర్ ట్రైనీ 50 ఉద్యోగాలకు డిప్లొమా చేసి ఉండాలి. వేతనం 17 వేల పైనా పొందవచ్చు.టెక్నీషన్ 50ఉద్యోగాలకు ఐటిఐ,14పైనా వేతనం పొందవచ్చు. దాదాపు (150) ఉద్యోగాల ఎంపికకు జాబ్ మేలా నిర్వహించబ డును. అభ్యర్థుల వయసు 18 నుండి 26 ఏళ్ల నిరుద్యోగ యువతి, యువకులు అర్హులు. అర్హత ఆసక్తి గల యువతి యువకులు విద్యార్హతల సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపిలతో జిల్లా ఉపాధి కల్పన కార్యలయం, ప్రభుత్వ ఐ.టి.ఐ క్యాంపస్ ములుగు రోడ్ , వరంగల్ నందు ఉదయం 11.00. లకు మే 30న జరుగు జాబ్ మేళాకు హాజరు కావలసిందిగా జిల్లా ఉపాధి కల్పన అదికారి యం. మల్లయ్య కోరారు. మరిన్ని వివరాలకు నెం. 9848895937 లో సంప్రదించా లన్నారు.

దుర్మార్గపు పాలనను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షులు పసుల రవికుమార్

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా



సీఎం కేసీఆర్ రాష్ట్రంలో సాగిస్తున్న దుర్మార్గపు పాలనను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఆర్‌పిఐ రాష్ట్ర అధ్యక్షుడు పసుల రవి కుమార్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంలోనూ రాష్ట్రంలో రాబోయే ఎలక్షన్ల కోసం ఏవిధంగా మనం ముందుకు వెళ్లాలి ప్రణాళికలను ఏర్పరుచుకోవడం తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్ దుర్మార్గ పాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లడం వంటి అంశాలను చర్చించడం జరిగింది.తెలంగాణలో ఆర్‌పిఐని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం, ప్రజా సమస్యలు తెలుసుకోవడం ఎప్పుడు ప్రజలతో మమేకం అవుతూ ప్రజలతో నిత్యంఉండడం సభ్యత్వాలను పెంచడం వంటి అంశాలను చర్చించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ మహిళా అధ్యక్షురాలు సీమ ఆటవాలే, మహిళా అధ్యక్షురాలు సరిగోముల స్నేహలత, రాష్ట్ర కార్యదర్శి గోరిక్ సింగ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రతన్ ప్రసాద్, హైదరాబాద్ సిటీ ప్రెసిడెంట్ అబ్దుల్ రహమాన్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నకిరేకంటి సంజీవరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు పొందాలి

నవతెలంగాణ-పరకాల



పట్టణంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచిత విద్యను అభ్యసించుటకు అడ్మిషన్ పొందాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సంతోష్ కుమార్ అన్నారు. శనివారం అడ్మిషన్లు పొందే ప్రక్రియలో భాగంగా వాల్ పోస్టర్ను ఆవిష్కరించారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు ఉచిత విద్య అందించుటకు ఉచిత అడ్మిషన్లు ప్రక్రియను ఆన్లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు అవకాశం కల్పించిందని ఈ అవకాశాన్ని ఇంటర్మీడియట్ విద్యను పూర్తిచేసిన విద్యార్థులు ఉపయోగించుకోవాలని అన్నారు. డిగ్రీ కోర్సులో చేరేందుకు తెలుగు, ఇంగ్లీష్ మీడియాలో అడ్మిషన్లు విద్యార్థులు తీసుకోవచ్చా అని అన్నారు. నూతనంగా సైన్స్ చదివే విద్యార్థులకు బిఎస్సి డైరీ కోర్స్ ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. అనంతరం అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా విద్యార్థులను అడ్మిషన్ల గురించి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు దుప్పటి సంజయ్ కుమార్ ,తదితరులు పాల్గొన్నారు.

రాజమండ్రికి తరలిన టీడీపీ శ్రేణులు

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా



సంక్షేమ కార్యక్రమాలకు అంకురార్పణ చేసి ప్రజల గుండెల్లో జన నాయకుడిగా చిరస్థాయిగా నిలిచిపోయిన ఆద్యుడు ఎన్టీఆర్ అని టీడీపీ నేతలు కొనియాడారు. స్వర్గీయ నందమూరి తారకరామారావు శతజయంతి ఉత్సవాలు రాజమండ్రిలో జరుపుకుంటున్న సందర్భంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎండి.రహీం ఆధ్వర్యంలో హన్మకొండ పోలీస్ హెడ్ క్వార్టర్ ఎదురుగా గల ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి వెయ్యి మంది పైగా హన్మకొండ నుండి తరలివెళ్లారు. ఇప్పటికైనా ఎన్టీఆర్‌కు కేంద్రం భారతరత్న ఇచ్చి గౌరవించాలని, ఎన్టీఆర్ వర్ధంతి, జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని రహీమ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి హనుమకొండ సాంబయ్య, రాష్ట్ర కార్యదర్శి బాబా ఖాదర్ అలీ, లక్ష్మణ్, గొల్లపల్లి ఈశ్వర చారి, జయశంకర్, మనోహర్, రవీందర్ గుప్తా, పిట్టల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు శిక్షణ తరగతులు

నవతెలంగాణ-మట్టెవాడ



దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో వరంగల్ జిల్లా ఆశా కార్యకర్తలకు 5వ బ్యాచ్ చివరి రోజు హెచ్‌బి ఎన్ సీ, హెచ్‌బీవైసీకి సంబంధించిన నవజాత శిశువుగృహ సందర్శన సంరక్షణ, చిన్న బిడ్డల గృహ సందర్శన కొరకు శిక్షణ కార్యక్రమము జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వరంగల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాజీపేట వెంకటరమణ ఆశ కార్యకర్త లకు సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశములు, స్త్రీల జీవితంలో వివిధ దశలలో కనిపించే సమస్యలు రక్తహీనత, అంటువ్యాధులు, అనారోగ్యంను సమస్యలు తగ్గించుట పసిపిల్లల పోషకాహార స్థితిని వద్ధి చేయుట, తగిన పెరుగుదల అభివద్ధిని నిశ్చయించుట గురించి తెలిపారు. గ్రామీణ ప్రాంతంలోని పట్టణ ప్రాంతంలోని ప్రజలకు శిక్షణానంతరము ఆశా కార్యకర్తల ద్వారా మెరుగైన సేవలు అందించడానికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ గోపాలరావు, డిప్యూటీ డెమో అనిల్ కుమార్, డిపిఎన్ఈహెచ్‌ఓ జ్ఞాన సుందరి, జిల్లా ఆప్తాలమిక్ ఆఫీసర్ ప్రతాపగిరి ప్రసాద్, జిల్లా టిఓటిలు వి.రజిని, డి.మేరీ, మనోజ, వరమ్మ స్వరూప, ఫెసిలిటేటర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో ఏపీజీవీబీ బ్యాంకు బదిలీ

నవతెలంగాణ-నెక్కొండ



మండలకేంద్రంలోని ఉమ్మడి గ్రామ పంచాయతీ లైన చిన్నకొర్పోల్ చెరువు ముం దు తండా, నాగారం బ్యాంకు ఖాతాదారులకు ఏపీజీవీ బ్యాంకు కేసముద్రం మండల శాఖ గత 30 సంవత్సరాలుగా సేవలను అందిస్తుంది. అయితేప్రస్తుతం కేసముద్రంలో కొనసాగుతున్న ఏపీజీవీబీ బ్యాంకు 1994కు ముందు నాగారంలో స్థాపించబడింది. అప్పటి నక్సలైట్ ప్రభావిత ప్రాంతం కావడం, నాగారం గ్రామం మండల కేంద్రానికి దూరంగా ఉండడంతో 1994 సంవత్సరంలో కేసముద్రం మండల కేంద్రానికి తరలించబడింది. అప్పటినుండి ఇప్పటివరకు ఖాతాదారులకు సేవలను అందిస్తుంది. అయితే ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లా నుండి మహబూబాబాద్ జిల్లా కొత్తగా ఏర్పడడంతో కేసముద్రం మండలం మహబూబాబాద్ జిల్లా పరిధిలోకి వెళ్ళింది. పరిపాలన రీత్యా బడ్జెట్ లో తేడా వలన పంట రుణాలు, కార్పొరేషన్ రుణాలు, మహిళా సంఘాల రుణాలు మంజూరు చేయడంలో అటు అధికారులకు, ఇటు ఖాతాదారులకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుంది.

ఇట్టి విషయాన్ని చిన్నకొర్పోల్ గ్రామ సర్పంచ్ కర్ర వెంకట్ రెడ్డి ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి ఎల్‌డిఎం రాజు, ఉన్నత అధికారులతో చర్చించి ఏపీజీవీ బ్యాంకును నెక్కొండ మండల కేంద్రానికి బదిలీ చేయడం తప్ప వేరేమార్గం లేదని చెప్పారు. కాగా ఈ ఏపీజీబీ బ్యాంకు ప్రస్తుతం కేసముద్రం నుండి నెక్కొండ మండల కేంద్రానికి బదిలీ చేయబడి ఖాతాదారులకు అందుబాటులోకి రావడంతో బ్యాంకు ఖాతాదారులు ఎమ్మెల్యే, అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ సందర్భంగా చిన్నకొర్పోల్ గ్రామ సర్పంచ్ కర్ర వెంకట్ రెడ్డి నర్సంపేట శాసనసభ్యుడు పెద్ది సుదర్శన్‌రెడ్డికి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా ఖాతాదారులు నెక్కొండ ఏపీజీబీ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిన్నకొర్పోల్ గ్రామ సర్పంచ్ కర్ర వెంకట్ రెడ్డి వెంట, కర్ర మహిపాల్ రెడ్డి, చిన్న కొర్పోల్ కారోబార్ పిట్టల,రాజ్ కుమార్, గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేష్ , గ్రామస్తులు పాల్గొన్నారు.

చెరువులో పడి బాలుడు మృతి

నవతెలంగాణ-నెక్కొండ



చెరువులో పడి ఓ బాలుడు మృతి చెందిన ఘటన మండలంలోని గొల్లపల్లి గ్రామంలో జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం పెద్దపల్లి.కిరణ్ కవితల కుమారుడు రాజేష్ (12) శుక్రవారం సాయంత్రం నుండి కనిపించకపోవడంతో గ్రామంలో వెతికారు. రాత్రి దాదాపు 8 గంటల సమయంలో గ్రామానికి సమీపంలో ఉన్న కుంటలో పడి మతిచెందాడని తెలిపారు. ఎప్పుడూ తమ కళ్లముందే తిరుగూ ఉండే తమ కుమారుడు తిరిగిరాని లోకాలకి వెళ్లడంతో చిన్నారి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రైతుల కోసం సిబ్బంది పునరంకితం కావాలి



నవతెలంగాణ-చెన్నారావుపేట

రైతు ఉత్పత్తిదారుల సమా ఖ్య రైతుల ఆలోచనలకు రూపా న్ని ఇచ్చే విధంగా, వారి ఉత్ప త్తులు అమ్ముకునేందుకు వారికి లాభాలు అర్జించే విధంగా సమావేశాల ద్వారాఆచరణ చేప ట్టి రైతుల కోసం సిబ్బంది పున రంకితం కావాలని అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ గొట్టే శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం గ్రామీణ పేదరిక నిర్మూల సంస్థ ఆధ్వర్యంలో అక్షయ మహిళా రైతు ఉత్పత్తిదారుల సమైక్య అధ్యక్షురాలు చిర్ర సృజన ఆధ్వర్యంలో సమావేశానికి శ్రీని వాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా ప్రాజెక్టు మేనే జర్ సరిత, సెర్ప్ ప్రాజెక్టు కోఆర్డిటర్ ముక్క చంద్రశేఖర్ లు మాట్లాడుతూ, నేష నల్ స్థాయిలో చెన్నారావుపేట మండలం పైలెట్ ప్రాజెక్టుగాసమీకృత వ్యవసాయ క్లస్టర్ను అభివద్ధి పరచడానికి అవకాశం వచ్చిందని, దీని ద్వారా ఇక్కడి రైతులకు మెరుగైన సేవలు అందించడానికి, వ్యవసాయ, వ్యవసాయ కుటుంబాల అభివద్ధికి ప్రయోగపూర్వక కార్యక్రమాలు చేపట్టడానికి అవకాశం ఏర్పడుతుందని, అక్షయ ద్వారా చేపట్టిన వివిధ కార్యక్రమాలు రాష్ట్రస్థాయిలో గుర్తింపు వలన ఈ అవకాశం చెన్నారావుపేట మండలానికి దక్కిందని, అందరూ సమిష్టిగా కషిచేసి ఈ ప్రాజెక్టును కూడా విజయవంతం చేయాల్సిందిగా తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో నెక్కొండ ఏపిఎం శ్రీనివాస్, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు ఏ కాంబరం, రవి, శారద, వెంకటేశ్వర్లు కట్టయ్య మాణిక్యం, సుజాత, మంజుల, అక్షయ మేనేజర్ ఐలయ్య రజిత, ఉమా, అక్షయ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు తిరుమల, అనిత, చిన్ని, రామక్క ,మొదలగు వారు పాల్గొన్నారు.

మాజీ జెడ్పీటీసీ మృతదేహానికి నన్నపనేని నివాళి

నవతెలంగాణ-మట్టెవాడ

వరంగల్ జిల్లా గీసుకొండ మండలం గంగాదేవి పల్లె సమీపంలో శనివారం కారు బస్సు ఢీ కొన్న ప్రమాదంలో వేం నరేందర్ రెడ్డి సహోదరుడు,కేసముద్రం మాజీ జెడ్పీటీసీ వేం పురుషోత్తం రెడ్డి దుర్మరణం పాలు అయ్యారు. చనిపోయిన అతని పార్థివ దేహాన్ని వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో పోస్టుమార్టం నిమిత్తం తరలించగా విషయంతెలుసుకున్న తూర్పు ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ మృతదేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అక్కడే ఉన్న వేం నరేందర్‌రెడ్డిని పరామర్శించి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో 24వ డివిజన్ నాయకులు ఆకుతోట శిరీష్, మనోహర్ పందికొండ శివ, ఎంజీఎం సూపరిడెంట్ వి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



బుస్సాపూర్‌లో అవగాహన సదస్సు

నవతెలంగాణ-గోవిందరావుపేట

మైనర్ బాలులకు వసతి కల్పించి అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మార్చుతున్న బుస్సాపురం గ్రామస్తులకు శనివారం అవగాహన కల్పించినట్లు బాలల సంక్షేమ సమితి చైర్పర్సన్ వసుధ తెలిపారు. ఈ సందర్భంగా వసుధ, బాలల సంక్షేమ కమిటీ సభ్యులు డాక్టర్ ఆకులపల్లి మధు, షాహిద్ బేగంలు గ్రామస్తులతో మాట్లాడుతూ బుస్సాపూర్ గ్రామంలో ప్రైవేటు అద్దె రూములలో బుస్సాపూర్ ప్రాంతానికి చెందిన అద్దె రూంలు మైనర్ బాలలకు వసతి కల్పించి అసాంఘిక కార్యక్రమాలకు నిలయాలుగా మారుతున్నాయని ఇది ఎంత మాత్రం సమాజానికి క్షేమకరం కాదన్నారు. గ్రామంలోని అద్దెరూంలు నడిపే యజమానులు ప్రభుత్వ నిబంధనలు తప్పకుండా పాటించాలని, కానీ ఇట్టి అద్దె రూంలు ఎలాంటి ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదని, లైసెన్స్ కూడా తీసుకోలేదని, అలా నడిపినట్లయితే చట్టరీత్యా చర్యలుతీసుకోబడతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సం క్షేమ అధికారి ఇపి ప్రేమలత, జిల్లా బాలల పరిరక్షణ అధికారి జె.ఓంకార్, డిసిపియు ఎల్ఎసిపిఓ డి.సంజీవ, చైల్డ్ లైన్ కౌన్సెలర్ రజిని,గ్రామ సర్పంచ్ శ్రీలత, కార్యదర్శి అశోక్, లిగల్ అధికారి సంజీవ, చైల్డ్ లైన్ కౌన్సిలర్ రజినీ మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలను విడుదల చేయాలి

నవతెలంగాణ-ములుగు

రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఉపాధ్యాయులకు రావలసిన పెండింగ్ బకాయిలను దీర్ఘకాలికంగా విడుదల చేయకపోవడం సరికాదని, బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్టీయు ఏటూర్‌నాగారం మండల అధ్యక్షులు మంచర్ల వీరభద్రం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు హక్కుగా రావలసిన ఆర్థిక ప్రయోజనాలను కూడా దీర్ఘకాలికంగా పెండింగ్ పెడుతూ చెల్లించకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని, ఉపాధ్యాయులకు చెందిన మెడికల్, జిపిఎఫ్, సరెండర్ తదితర బిల్లులు దీర్ఘకాలికంగా విడుదల కాకపోవడం వల్లఉపాధ్యాయులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. నూతన పిఆర్సి కమిటీని సకాలంలో నియమించాలని, జాప్యం లేకుండా నిర్ణీత గడువు లోపల నివేదిక అందించేలా ఉత్తర్వులు ఇ వ్వాలని వేతన జీవులకు నష్టం కలగకుండా మెరుగైన పిఆర్సిని అమలు చేయాల్సిన బాధ్యత ప్రజా ప్రభుత్వంపై ఉన్నదని గుర్తు చేశారు. గత పిఆర్సిలోని పెండింగ్ జీవోలను వెంటనే విడుదల చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

టీబీ రోగులకు ఒంటరి అనే భావన రావద్దు

నవతెలంగాణ-ములుగు

టీబి రోగులకు ఒంటరి అనే భావన రావద్దని జిల్లా టిబి ప్రోగ్రాం అధికారి డాక్టర్ పోరిక రవీందర్ తెలిపారు. నిక్షయ్ దివాస్ అనే కార్యక్రమాన్ని జిల్లా ఆసుపత్రిలో జరుపుకుంటున్నట్లు జిల్లా టిబి నియంత్రణ అధికారి డాక్టర్ పోరిక రవీందర్ తెలిపారు. టీబీ రోగులలో భరోసా కల్పించడానికి శనివారం జిల్లా ఆస్పత్రిలో సంతకాల సేకరించడం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా టిబి నియంత్రణ అధికారి డాక్టర్ రవీందర్ మాట్లాడుతూ టీబి రోగులు ఒంటరి అనే భావన రావద్దనే ఉద్దేశంతో మందులు వాడుతున్న వారితో ఇలా సంతకాలు సేకరించడం జరుగుతుందని, టీబీ మందులు వాడుతున్న వారు ఇతరులకు ఈ వ్యాధి సోకకుండా ఉండడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ యొక్క కార్యక్రమాన్ని జిల్లాలోని ఏడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆస్పత్రిలో నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి సూపర్డెంట్ డాక్టర్ జగ దీష్, డిపిఎం పుల్లూరు సమ్మయ్య పాల్గొన్నారు.

సదానందం గౌడ్‌కు ఎక్స్‌గ్రేషియా అందించాలి

నవతెలంగాణ-ములుగు/వెంకటాపూర్

వెంకటాపూర్ మండలంలోని లక్ష్మీదేవిపేట గ్రామానికి చెందిన మామిండ్ల సదానందం గౌడ్ తన విధి నిర్వహణలో భాగంగా ఈనెల 26 న తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవాశాత్తు చెట్టుపై నుండి పడగ నడుము, కాళ్లు, చేతులకు తీవ్రంగా దెబ్బలు తగలడం జరిగింది. ములుగు ఏరియా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న సందానందం గౌడ్‌ను కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గుండెబోయిన రవిగౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు దొమ్మటి సదయ్య గౌడ్‌లు మాట్లాడుతూ నిబంధనలు పక్కన పెట్టి తాటి చెట్టు పైనుండి పడిన గీత కార్మికులకు తక్షణమే ఎక్స్‌గ్రేషియా అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు సంఘం ఆధ్వర్యంలో తక్షణ సహాయం కోసం టాడికా ర్పొరేషన్‌కు దరఖాస్తు చేయడం జరిగిందని రవిగౌడ్, సదయ్య గౌడ్ తెలిపారు.

ఇ-టెండర్‌కి ఆహ్వానం

నవతెలంగాణ-పాలకుర్తి

శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి దేవస్థానముకు కిరాణ, సామాగ్రి పూజా సామాగ్రి సప్లై చేయుటకు ఇ-ప్రొక్యూర్ మెంట్ ద్వారా టెండర్లు కోరుతున్నట్లు ఆలయ ఈవో బి.లక్ష్మీ ప్రసన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మరింత సమాచారం కొరకు https://tender.telangana.gov.in వెబ్‌సైట్ చూడాలని, పూర్తి వివరాల కోసం దేవస్థాన కార్యాలయంను సంప్రదించాలని తెలిపారు.

కర్ణాటక సీఎం సిద్ధిరామయ్య కలిసిన సంపత్

నవతెలంగాణ-లింగాలఘనపురం

కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధిరామయ్యను కొమురవెల్లి దేవస్థానం మాజీ చైర్మన్ కురుమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెవెల్లి సంపత్ శనివారం మర్యాద పూర్వకంగా కలిసి గనశూలం, డమరుకం బహుకరించి శుభాకాంక్షలు తెలియజేశారు. వీరి వెంట కురుమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ



నవతెలంగాణ-గూడూరు

మండల కేంద్రం తహసిల్దార్ కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి, షాద్ ముబారక్ చెక్కులను 37 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ పథకం పేద ప్రజలకు ఎంతో ఆసరాగా నిలుస్తుందన్నారు. ఆడపిల్లల తల్లితండ్రులు ఆర్థికంగా ఇబ్బంది పడవద్దు అనే ఉద్దేశ్యంతో సిఎం కేసీఆర్ ఈ పథకాన్ని ప్రవేశ పెట్టారని అన్నారు. పనిచేసే ప్ర భుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఎమ్ఐ అశోక్ కుమార్, మండల పార్టీ అధ్యక్షులు వేం వెంకటకృష్ణారెడ్డి, మండల సర్పంచ్ల ఫోరంఅధ్యక్షులు ముక్క లక్ష్మణ్‌రావు, గుండెంగా ఎంపీటీసీ బోడ కిషన్, మండల ప్రధాన కార్యదర్శి నూకల సురేందర్, ముఖ్యనాయకులు రహీం, సంపత్‌రావు, కటార్ సింగ్, వెంకన్న, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ఘనంగా నెహ్రూ వర్ధంతి వేడుకలు







నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

మాజీ శాసనసభ్యులు, టిపిసిసి సభ్యులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో దేశ మొదటి ప్రధాన మంత్రి జవహర్లాల్ నెహ్రూ వర్ధంతి వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూల మాలలు వేసి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు.అనంతరం చీటాకోడూర్ పిఎసిఎస్ డైరెక్టర్ వంగాల మల్లారెడ్డి, జిల్లా నాయకులు జిల్లెల సిద్ధారెడ్డి, కిసాన్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు మోటే శ్రీనివాస్, నాయకులు లింగాల నర్సిరెడ్డి, ఆలేటి సిద్దరాములు, నల్లగోని బాలకిషన్ గౌడ్, బొట్ల నర్సింగరావు మాట్లాడుతూ భారత దేశానికి ప్రధానిగా పనిచేసిన నెహ్రూ దేశాన్ని బ్రిటిష్ కబంధహస్తాల నుంచి విడిపించడంలో కీలకపాత్ర పోషించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ చిన్నోజు విజయలక్ష్మి, దాసరి శేఖర్, పిట్టల సతీష్, ఆకుల లక్ష్మయ్య, బండారు శ్రీనివాస్, ఎండి గౌస్, కడారి ప్రవీణ్, తాటి కనుక స్వామి, దేవునూరి చంద్రయ్య, లింగాల వెంకటరామిరెడ్డి, కర్ణాకర్ పాల్గొన్నారు.

ములుగు : నెహ్రూ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి కాంగ్రెస్ పార్టీ జాతీయ నేత, ఎమ్మెల్యే సీతక్క ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం పూల మాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెహ్రూ దేశానికి చేసిన సేవలు మరువలేనివి అని ఆయన ఆశయాలను కొనసాగిస్తామని సీతక్క అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనీల్, మార్క విజయ్ కుమార్ కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు గొల్లపెల్లి రాజేందర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బానోత్ రవి చందర్,మండల అధ్యక్షులు ఎండీ చాంద్ పాషా, వర్కింగ్ కమిటీ అధ్యక్షులు ఆకు తోట చంద్రమౌళి, నల్లెల భరత్ కుమార్,సహకార సంఘం చైర్మన్ బొక్క సత్తిరెడ్డి,జిల్లా నాయకులు చింత నిప్పుల భిక్షపతి,ఎంపీటీసీ మవురపు తిరుపతిరెడ్డి, తక్కల్ల పెల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

కేసముద్రం రూరల్ : కేసముద్రం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంబటి మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో స్వర్గీయ మాజీ ప్రధాని నెహ్రూ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించి నివాళులు అర్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ అల్లం నాగేశ్వరరావు, పోలెపాక నాగరాజు, అయూబ్ ఖాన్, ఎస్టీ సెల్ జిల్లా కార్యదర్శి ఇస్లావత్ చందు, ఎంపీటీసీ ధరావత్ బాలు నాయక్, కీర్తి సురేందర్, కళ్లెం శ్రీనివాస్ రెడ్డి, తరాల సుధాకర్, పరాంకుశం శ్రీహరి, సామ సుధాకర్, వాంకుడోత్ బీలియా తదితరులు పాల్గొన్నారు.

గార్ల : మండల కేంద్రంలోని స్థానిక నెహ్రూ సెంటర్‌లో మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి వేడుకలను శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ విగ్రహానికి ఆ పార్టీ మండల అధ్యక్షుడు ధనియాకుల రామారావు, ముల్కనూరు ఎంపిటిసి మాళోత్ వెంకట్‌లాల్‌లు నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు టి.కృష్ణ గౌడ్, చషంషాద్ బేగం, సుందర్, నవీన్, రాము తదితరులు ఉన్నారు.

మూల్యాంకనం పాఠశాల పునఃప్రారంభం నాటికి పూర్తి చేయాలి

నవతెలంగాణ-ములుగు

పాఠశాల ప్రమాణాల అంతర్గత మూల్యాంకనం పాఠశాల పున:ప్రారంభం నాటికి పూర్తి చేయాలని డీఈవో పాణిని తెలిపారు. ప్రతీ పాఠశాలలో కూడా ప్రధానోపాధ్యాయులతో కూడిన బృందం పాఠశాలలో ఉన్నటువంటి అన్ని వనరులను ఎలా ఉపయోగించుకోవాలో సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, వనరులు ఏవిధంగా సమకూర్చుకోవాలో ప్రణాళికను ఏర్పరచు కోవాలని, పాఠశాలలో ఉన్నటువంటి అన్ని వనరుల పైన అవగాహన కలిగి వాటి యొక్క బలా బలాలను నిర్ధారించుకొనుటకుఈఅంతర్గత మూల్యాంకనం ఉపయోగపడుతుందన్నారు. శాల సిద్ధి అనేటువంటిది జాతీయస్థాయిలో జరుగుతున్నటువంటి కార్యక్రమమని దీనికిగాను మన జిల్లా నుండి నలుగురు సమగ్ర శిక్ష సమన్వయకర్తలు, ముగ్గురు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మూడు రోజులపాటు రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందడం జరిగిందన్నారు. మన జిల్లాలో 15 ప్రాథమిక పాఠశాలలో, ఐదు ప్రాథమిక ఉన్నత పాఠశాలలో, 10 ఉన్నత పాఠశాలలో ఈ అంతర్గత మూల్యాంకనమును నిర్వహించి పాఠశాలకు దార్శనికతను రూపొందించుకొని, దానికి తగిన విధంగా కార్యాచరణ ప్రణాళికను ఏర్పాటు చేసుకొని పాఠశాల అభివృద్ధి చేయాలని డీఈవో పాణిని తెలిపారు. పాఠశాల ప్రారంభం నాటికి నిర్దేశించినటువంటి 30 పాఠశాలలో అంతర్గత మూల్యాంకనం నిర్వహించాలని జిల్లా సమగ్ర శిక్ష క్వాలిటీ కోఆర్డినేటర్ బద్దం సుదర్శన్‌రెడ్డి తెలిపారు. హైదరాబాదులో శాలసిద్ధి కార్యక్రమంపై నిర్వహించినటువంటి మూడు రోజుల వర్క్‌షాప్‌లో ములుగు జిల్లా ప్రతినిధులు ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకుగాను బహుమతి అందుకున్నారు.

పాలీసెట్‌లో సత్తా చాటిన శ్రీ వివేకవర్ధిని విద్యార్థులు

నవతెలంగాణ-కేసముద్రం రూరల్

కేసముద్రం మండలంలోని కేసముద్రం విలేజ్ శ్రీ వివేకవర్ధిని హై స్కూల్ 10వ తరగతి విద్యార్థులు పాలీసెట్‌లో సత్తా చాటినట్లు పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించిన పాలిటెక్నిక్ ఫలితాలలో పాఠశాలకు చెందిన విద్యార్థులు మలిశెట్టి రాహిత్య వర్షిని ఏం బైపీసీలో 570 ర్యాంకు, ఎంపీసీలో 749వ ర్యాంకు, మామిడి అవినాష్ ఎంపీసీలో 572వ ర్యాంకు రాష్ట్రస్థాయి ర్యాంకులతో సత్తా చాటినట్లు తెలిపారు.

సీఎం కప్‌లో జిల్లా స్థాయిలో రెండవ బహుమతి పొందిన బచ్చన్నపేట

నవతెలంగాణ-బచ్చన్నపేట

సీఎం కప్‌లో మండల పరిధిలో విజేతలు జిల్లాస్థాయిలో కోకో విభాగంలో జిల్లాస్థాయిలో రెండవ బహుమతి బచ్చన్నపేట యువకులు పొందారు.ఈ సందర్భంగా ఎంపీపీ బావణల నాగజ్యోతి కృష్ణంరాజు గెలుపొందిన యువతులను అభినందించారు. రాష్ట్రస్థాయిలో పోటీలలో పాల్గొని గెలుపొంది బచ్చన్నపేటకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఎమ్మెల్యే రాజయ్యను కలిసిన ప్రెస్ కబ్ల్ కమిటీ

నవతెలంగాణ-లింగాలఘనపురం

హనుమకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు తెలంగాణ తొలి మాజీ ఉముఖ్య మంత్రి ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్యని మర్యాదపూర్వకంగా ప్రెస్ కబ్ల్ అధ్యక్షుడు బోడ్డు వెంకన్నతో పాటు కమిటీ సభ్యులు శనివారం కలిశారు. మండలానికి చెందిన నూతనంగా ఎన్నికైన నూతన ప్రెస్ కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కమిటీ సభ్యులు వారితో పాటుగా బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బస్వగాని శ్రీనివాస్ గౌడ్, మణిక్యపురం గ్రామ సర్పంచ్ శ్వేతా పూర్ణచందర్‌లు ఉన్నారు.

ఆత్మీయ సమ్మేళనాలను విజయవంతం చేయాలి : బీఆర్ఎస్

నవతెలంగాణ-పాలకుర్తి

ఈనెల 29న దర్దేపల్లి పాలకుర్తి గ్రామాల్లో జరిగే ఆత్మీయ సమ్మేళనాలను విజయవంతం చేయాలని బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, ఎంపీపీ నల్ల నాగిరెడ్డిలు కోరారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు శనివారం మండలంలోని కొండాపురం, పెద్దతండ(కె), టీఎస్ కే తండా, దర్దేపల్లి, పాలకుర్తి గ్రామాల్లో ఆత్మీయ సమ్మేళనం సన్నాహక సమావేశాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జడ్పీ ఫ్లోర్ లీడర్ పుష్కారి శ్రీనివాసరావు, కొడకండ్ల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు, జిల్లా కోఆప్షన్ సభ్యులు ఎండి మదర్, రైతు బంధు సమితి మండల కన్వీనర్ వీరమనేని యాకాంతరావులతో కలిసి వారు మాట్లాడుతూ ఈనెల 29న ఉదయం ఎనిమిది గంటలకు పాలకుర్తిలో నిర్వహించే ఆత్మీయ సమ్మేళనానికి పాలకుర్తి వన్, పాలకుర్తి టు ఎంపిటిసిల సెగ్మెంట్లు హాజరవుతాయని, దర్దేపల్లిలో మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఆత్మీయ సమ్మేళనానికి దర్దేపల్లి టీఎస్ కే తండా కొండాపురం పెద్దతండ కె గ్రామాలు హాజరవుతాయని తెలిపారు. ఆత్మీయ సమ్మేళనానికి హాజరయ్యే కార్యకర్తలకు భోజన వసతి కల్పించామని, ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి సొసైటీ చైర్మన్ బొబ్బల అశోక్ రెడ్డి, వైస్ చైర్మన్ కారుపోతుల వేణు, పాలకుర్తి సొసైటీ మాజీ చైర్మన్ పాపారావు, పండ్ల మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ లావుడియా దేవా నాయక్, సర్పంచులు ఇమ్మడి ప్రకాష్, ధారావత్ బాలు నాయక్, సీనియర్ నాయకులు గజ్జి సంతోష్, కమ్మగాని రమేష్ పాల్గొన్నారు.

రైస్ మిల్లర్లతో కుమ్మకై రైతులకు దోచుకుంటున్నారు

నవతెలంగాణ-ములుగు

ధాన్యం కొనుగోలు సెంటర్ల నిర్వాహకులు రైస్ మిల్లర్లతో కుమ్మకై రైతులకు దోచుకుంటున్నారని బిజెపి జిల్లా అధ్యక్షులు చింతలపూడి భాస్కర్ రెడ్డి అన్నారు. బీజేపీ ములుగు జిల్లా పిలుపు మేరకు కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షులు జినుకల కృష్ణాకర్ రావు ఆధ్వర్యంలో శనివారం జిల్లా అడిషనల్ కలెక్టర్ వైవి గణేష్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి జిల్లా అధ్యక్షులు చింతలపూడి భాస్కర్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర 2060 రూపాయలు కాకుండా 1750 నుండి 1800 రూపాయల వరకు కొనుగోలు చేస్తూ రైతులను మోసం చేస్తున్నారన్నారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నగరపు రమేష్, అసెంబ్లీ కన్వీనర్ సిరికొండ బలరాం, రాష్ట్ర పాలసీ అండ్ రీసెర్చ్ కన్వీనర్ భూక్యా రాజు నాయక్, నియోజకవర్గ నాయకులు భూక్యా జహార్‌లాల్, పోరిక ఉత్తంకుమార్, జిల్లా కార్యదర్శి శ్రీమంతుల రవీంద్ర చారి,కార్యాలకార్యదర్శి చల్లూరి మహేందర్, ప్రచార కార్యదర్శి దొంతిరెడ్డి రవిరెడ్డి, యువమోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దొంతిరెడ్డి రాకేష్ రెడ్డి, యువమోర్చ జిల్లా అధ్యక్షులు కొత్త సురేందర్, బిజెపి మండల అధ్యక్షులు ఇమ్మడి రాకేష్ యాదవ్, సీనియర్ నాయకులు కారుపోతుల యాదగిరి గౌడ్, మేకల రమేష్, కారిపోతుల దేవేందర్ గౌడ్,గొల్లపల్లి రవి, కరుకురి రమేష్ సురేష్, మేకల రవి, కుమార్, శ్రీనివాస్, పైడాకుల మల్లేష్, తెరుక ధర్మయ్య, నూనె రాజు, పనీశ్వర్ రెడ్డి, రాస మల్ల కుమార్, అజ్మీర రాజు, పడాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.